

మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,

https://www.sreechakranews.com

# శ్రీచక్ర


SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 176 | కర్నూలు | బుధవారం జూలై 23 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi



## ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ,జూలై22((శ్రీచక్ర) : ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సమర్పించగా.. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దానికి ఆమోదం తెలి పారు. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయం హోంమంత్రిత్వ శాఖకు తెలియజేసింది. అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా చేస్తున్నాట్లుగా ప్రకటించారు. అయితే ఆయన రాజీనామాపై ఎలాంటి అనుమానాలు ప్రభుత్వం పక్షాన వ్యక్తం కాలేదు. సరికదా ఆయన ఆయురారోగ్యా లతో ఉండాలని కోరుకుంటున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి పదవితో సహా వివిధ హోదాల్లో ధన్‌ఖడ్ దేశానికి సేవలు అందించారని అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు- వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖడ్.. రాత్రి కల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగ ుతున్నట్లు- అందులో పేర్కొన్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు అండగా నిలిచిన రాష్ట్రపతికి కృత జ్ఞతలు. పదవీకాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని ధన్యవాదాలు చెప్పారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయిం చుకున్నారు.



## నితీష్‌ను తప్పించే కుట్ర..

పాట్నా:(శ్రీచక్ర) ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వెనుక బీజేపీ కుట్ర ఉందని రాష్ట్రీయ జనతాదళ్ సంచలన ఆరోపణ చేసింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే నితీష్ కుమార్‌ను మార్చేందుకే ఇలా చేసినట్టు అసెంబ్లీలో ఆర్జేడీ చీఫ్ విప్ అఖ్తరుల్ ఇస్లామ్ షహీన్ అన్నారు. మంగళవారంనాడిక్కడ మిడియాతో అఖ్తరుల్ మాట్లాడుతూ, చాలాకాలంగా నితీష్ కుమార్‌కు ఉద్వాసన చెప్పేలా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, ఒక దశలో నితీష్‌ను ఉప ప్రధానిని చేయాలని కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ చౌబే మాట్లాడారని గుర్తు చేశారు. ఈ దశలో జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంలో బీజేపీ కుట్ర కనిపిస్తోందని అన్నారు. ఉపరాష్ట్రపతి వంటి రాజకీయ ప్రాధాన్యత లేని పదవిని ఇచ్చి నితీష్‌ను తప్పించాలని బీజేపీ భావిస్తోందని చెప్పారు. కాగా, ఆర్జేడీ నేత చేసిన ఆరోపణలను జేడీయూ సీనియర్ నాయకుడు శరవణ్ కుమార్ తోసిపుచ్చారు. నితీష్ కుమార్ బిహార్‌ను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు.ఆయనఇక్కడే ఉంటారని,అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయానికి సారథ్యం వహిస్తారని, రాష్ట్ర ప్రజలకు మరో ఐదేళ్లు సేవలందిస్తారని చెప్పారు. జగదీప్ ధన్‌ఖడ్ వైద్య కారణాలను పేర్కొంటూ ఉపరాష్ట్రపతి పదవికి సోమవారం రాత్రి రాజీనామాచేసారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు.

# మహిళలకు గుడ్‌న్యూస్..

## ఆడబిడ్డ నిధిపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




నంద్యాల:(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వడివడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకాన్ని కూడా త్వరలోనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆడబిడ్డ నిధి పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకంలో భాగంగా ప్రతి మహిళకు కూటమి ప్రభుత్వం నెలకు రూ.15000 అందించనుంది. ఈ పథకం ప్రకారం 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న వారికి బ్యాంకు ఖాతాలో రూ.15000 జమ చేయనున్నారు. అయితే ఈ పథకంపై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి కీలక ప్రకటన చేశారు.ఆడబిడ్డ నిధిని కూడా త్వరలో ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి (తెలిపారు. ఆడబిడ్డలకు పెళ్లి, ఉద్యోగం వచ్చే వరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధితో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చెప్పిన మాట చేసి చూపించే వ్యక్తి చంద్రబాబునాయుడు అని అభివర్ణించారు. నంద్యాల జిల్లాలోని గడివేముల మండలం దుర్వేసిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, శాసన సభ్యురాలు గౌరు చరితా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను చాలామంది అవహేళన చేశారని... కాని ప్రజలు విశ్వసించారు, గెలిపించారని ఉద్ఘాటించారు.

## మద్యనిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి దోపిడీ

వైసిపి హయాంలో ఏరులై పారిన అక్రమ మద్యం
నిధులు దోచుకుని...ప్రజల ప్రాణాలు మింగేశారు
రప్పారప్పా అని బెదిరిస్తే..బెదిరే వారు లేరు
బదిరింపు రాజకీయాలను జగన్ మానాలి
మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



పవన్ కల్యాణ్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఏరులై పారించిందని ఆరోపించారు. మద్య నిషేధం నినాదంతో అధికారంలోకి వైసీపీ వచ్చిందని.. కానీ ఆ హామీని జగన్ మర్చిపోయారని మండిపడ్డారు. అనేక మందికి నాసిరకం మద్యంతో లివర్ దెబ్బ తిని ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు.మంగళవారం పవన్ మీడియతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులు తినేశారు.. మరోవైపు జనం ప్రాణాలు తీశారని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. అయినా ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడ నిలబడ్డామని... ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించు కోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు.

## విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను సందర్శించిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్

### ప్లాంట్ ను నష్టాల నుండి లాభాల్లోకి తీసుకువచ్చేందుకు అధికారులతో రివ్యూ

విశాఖపట్నం, జూలై 22 (శ్రీచక్ర)3 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ ఈరోజు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (రిన్ల్ ) ను సందర్శించారు. ఆయన రిన్ల్ డైరెక్టర్లు మరియు సీనియర్ అధికారులతో వివరణాత్మక చర్చలు జరిపారు. ప్లాంట్ పరిణామం, ఇటీవలి మైలురాళ్ళు మరియు భవిష్యత్తు రోడ్ మ్యాప్ ను వివరిస్తూ అధికారులు.. మంత్రికి సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యకలాపాలను పునరుద్ధరించడంలో మరియు ప్లాంట్ ను పునరుద్ధరణ దిశగా నడిపించడంలో ఖీఎౌఒ ఉద్యోగులు మరియు వాటాదారుల కృషిని మంత్రి టీజీ భరత్ ప్రశంసించారు. రిన్ల్ సెప్టెంబర్ 2024 నుండి ఉత్పత్తిని గణనీయంగా పెంచిందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జూలై 2025 నాటికి సింగిల్ నుండి మూడు బ్లాస్ట్ ఫర్నేసులు పనిచేస్తున్నాయి. బ్లాస్ట్ ఫర్నేస్-3 స్థిరీకరణతో, ప్లాంట్ 100% సామర్థ్య వినియోగాన్ని సాధించడానికి మరియు ఉక్కు రంగంలో తన నాయకత్వాన్ని తిరిగి పొందే మార్గంలో ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్లాంట్ ను నష్టాలనుండి లాభాల్లోకి తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించి పలు సూచనలు



చేశారు. క్యాప్టివ్ మైన్స్ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడానికి తేలియాడే సౌర విద్యుత్ సంస్థాపనలు మరియు సాంకేతిక అడ్డంకులను తొలగించడం వంటి ఖర్చు ఆదా వ్యూహాలను అవలంబించాలని ఆయన రిన్ల్ కు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి పూర్తి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మోడల్ రూమ్ మరియు కీలక ఉత్పత్తి యూనిట్లను సందర్శించారు. ఉత్పత్తికి సంబంధించి అధికారులు ఉద్యోగులతో మాట్లాడారు.



## అమరావతి రైతుల కీలక ప్రకటన..

గుంటూరు:(శ్రీచక్ర) అమరావతి రైల్వేలైన్ భూసేకరణకి నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు కొప్పురావూరికి చెందిన కొంతమంది రైతులు. ధ్రువీకరణ పత్రాలతో జాయింట్ కలెక్టర్ ఎదుట హాజరు కావాలని అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులకు నోటీసులు ఇచ్చారు. ఈరోజు(మంగళవారం) జాయింట్ కలెక్టర్ ఎదుట రైతులు హాజరయ్యారు. రైతుల అభ్యంతరాలను జాయింట్ కలెక్టర్ నమోదు చేశారు.ఈ సందర్భంగా మీడియాతో అమరావతి రైతులుమాట్లాడారు. అమరావతి రైల్వేలైన్‌కు భూములివ్వటానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. అయితే ఎంత నష్టపరిహారం ఇస్తారు, భూ సమీకరణలో భూములు తీసుకుంటే రిటర్నబుల్ ప్లాట్స్ ఎక్కడిస్తారో స్పష్టంగా ప్రకటన చేయాలని సూచించారు. స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే భూములు తీసుకోవాలని కోరారు. కొన్నిప్రాంతాల్లో డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగాయని చెప్పుకొచ్చారు. న్యాయపరమైన చిక్కులు ఉన్న చోట నిజమైన భూ యజమానిని గుర్తించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశామని అన్నారు. ఏపీ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నామని అమరావతి రైతులు పేర్కొన్నారు.

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY

బుధవారం జూలై 23 2025

# సంపాదకీయం

## అమెరికాకు గర్వభంగం

మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభించిన రష్యా.. ఆ దేశంతో కయ్యం పెంచుకుంటూ పోతూందే తప్ప ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ఈ సందర్భంలో ప్రపంచ దేశాల మధ్య అన్ని యుద్ధాలను తానే ఆపాననే భ్రమలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్నీ ఆపుతానని బీరాలు పలికారు. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సదస్సు సందర్భంగా ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఫోన్‌లైన్‌లో కోరారు. కానీ, రష్యా అధ్యక్షుడు ఎక్కడా ట్రంప్ మాట పట్టించుకున్నట్టు కనిపించలేదు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరికలకు దిగారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కూడా పేర్కొన్నారు. ఈ హెచ్చరికలు పరోక్షంగా భారత్‌ను కూడా తాకాయి. ఇక్కడ విచిత్రమేమిటంటే.. ఎలాంటి అంతర్జాతీయ అధికారిక అర్హతలు లేని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది. నాటో హెచ్చరికలపై భారత్ కూడా దీటుగానే స్పందించింది. భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజాప్రయోజన కోణంలోనే ఉంటాయని, సుస్థిరమైన ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని తాజాగా భారత విదేశాంగ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. మార్కెట్‌లో తక్కువ ధరకు చమురు లభించే దేశంలో కొనుగోలు చేయడం సర్వసాధారణమని, యుద్ధంతో వాణిజ్య అంశాన్ని ముడిపెట్టడం తగదని సూచించారు. వాణిజ్య సమస్యలను పరిష్కరించే అధికారం కేవలం వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో)కు మాత్రమే ఉందని, ఉత్తర అట్లాంటిక్ ఖండంలోని కొన్ని దేశాల సైనిక కూటమి నాటోకు వాణిజ్య ఒప్పందాల్లో ఎలాంటి ప్రమేయం, హక్కులు ఉండవని తేల్చి చెప్పారు. వేల సంవత్సరాల చరిత్రలో ఏ దేశం మీదా దండయాత్రకు దిగని దేశంగా భారత్‌కు గుర్తింపు వుంది. భారత్ ఎప్పుడూ శాంతిపూర్వక వాతావరణంలోనే సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆసక్తి చూపుతుంది. అది వాస్తవం. భారత ప్రధాని మోదీ గతేడాది ఆగస్టులో నాటి అమెరికా అధ్యక్షుడు బైడన్‌తో ఫోన్‌లో సంభాషిస్తూ రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతినెలకొనేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఉక్రెయిన్ రష్యా యుద్ధం విషయంలో నాటో వంటి సైనిక కూటమి నుంచి శాంతి సూచనలు వినాల్సిన అవసరం లేదని భారత విదేశాంగశాఖ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. పునః వినియోగ ఇంధన వనరులతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి ఆత్మనిర్భర్ దిశగా వెళ్తున్న భారత్, రష్యా, అమెరికా మొదలు పశ్చిమాసియా, ఆఫ్రికా దాకా వేర్వేరు ఖండాల్లోని దేశాల నుంచి ముడిచమురు, సహజ వాయువులను దిగుమతి చేసుకుంటోంది. భారత ఇంధన భద్రత విషయంలో వేలుపెట్టే అధికారం ఏ దేశానికీ లేదు. అలాంటప్పుడు నాటోకు ఆ అధికారం ఎక్కడిదని పలుదేశాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఒకవేళ భారత్ నాటో హెచ్చరికలను సీరియస్‌గా తీసుకుంటే, నాటో సభ్య దేశాలతో, ముఖ్యంగా అమెరికా దౌత్య బంధానికి స్వల్ప బీటలు పడే అవకాశముంది. చైనా, భారత్ సారథ్యంలో పటిష్టమవుతున్న 'బ్రిక్స్' కూటమి ఇప్పుడు అంతర్జాతీయ మారకమైన డాలర్ ఆధిపత్యానికి గండికొట్టి ప్రత్యామ్నాయ కరెన్సీని ముందుకు తీసుకొస్తుందనే భయం అమెరికాను వెంటాడుతున్నది. అందుకే అమెరికా కనుసన్నల్లో ఉండే నాటో లాంటి సైనిక కూటమితో పరోక్ష హెచ్చరికలు చేస్తోందని సంకేతాలున్నాయి. యుద్ధానికి వాణిజ్యంతో ముడిపెట్టడం సరికాదని, అంతర్జాతీయ వాణిజ్య విభేదాలను పరిష్కరించేందుకు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్(డబ్ల్యూటీవో) ఉండనే ఉంది. మరి డబ్ల్యూటీవో విధుల్లోకి నాటో ఎందుకు తలదూర్చుతోందన్న విమర్శలు అన్ని వైపుల నుంచి మొదలయ్యాయి. అమెరికా స్వప్రయోజనాలు కాపాడే డమ్మీ వాణిజ్య విభాగం స్థాయికి నాటో పడిపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్స్ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తీవ్రంగా స్పందించారు. ప్రపంచానికి ఒక చక్రవర్తి అవసరం లేదని, పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆయన స్పష్టం చేశారు. రియో డి జెనీరోలో సోమవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అనంతరం లూలా మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కొత్త పద్ధతిలో తీర్చిదిద్దేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయని, అందుకే కొందరికి ఇది ఇబ్బందికరంగా మారిందని ఆయన అన్నారు. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు పూర్తిగా డాలర్‌పై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనాల్సిన అవసరం ఉందని లూలా నొక్కిచెప్పారు. ఇది క్రమంగా జరగాల్సిన ప్రక్రియ అని, ఇందుకోసం సభ్య దేశాల సెంట్రల్ బ్యాంకులు కలిసి పనిచేయాలని సూచించారు. గతంలోనే హెచ్చరించారు. తాజాగా ఆయన 14 దేశాలపై అధిక సుంకాలను విధించి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. అయితే, బ్రిక్స్ దేశాలపై వెంటనే సుంకాలు విధించే ఆలోచన లేదని, కానీ అమెరికా వ్యతిరేక చర్యలకు పాల్పడితే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని యూఎస్ వర్గాలు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. మరోవైపు, ట్రంప్ హెచ్చరికలపై ఇతర బ్రిక్స్ దేశాలైన చైనా, రష్యా, దక్షిణాఫ్రికా ఆచితూచి స్పందించాయి.

# ఘనంగా డిఈఎఫ్ వేడుకలు...

**దివ్యాంగులకు అండదండలు అంధించడమే మా ధ్యేయం**
**డిఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మల్లేలబ్లెడ్ రాజు,**
**సెక్రడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న**




కర్నూలు, జూలై 22 (శ్రీచక్ర): కర్నూలు పట్టణంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంగళవారం డిఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి సి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవ సభకు ముఖ్య అతిథులుగా డిఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మల్లేలబ్లెడ్ రాజు, సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న, జిల్లా ప్రెస్ ఎపిడబ్ల్యుజే అధ్యక్షులు ఈ నాగరాజు గౌడ్, దివ్యాంగుల ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ క్రిష్ణుడు, టిడిపి దివ్యాంగుల విభాగం సెక్రటరీ నీలా జోజిబాబు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారిక కోసం వారి యొక్క జీవిత వెలుగుల కోసం ఎప్పుడూ వెన్నంటి ఉంటామని తగిన సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ అధ్యక్షులు బి సి నాగరాజు, ప్రధాన కార్యదర్శులు ఎం. శివశంకర్, కె ఈరన్న, ఉపాధ్యక్షులు కమతం వెంకటేశ్, కోశాధికారి ఆదిశేషయ్య, సలహాదారులు రామాంజనేయులు మాట్లాడుతూ కచ్చితంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం 2016-వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని, ఈ 2016 చట్టాన్ని అమలు చేసినప్పుడే మా జీవితాలు వికసిస్తాయని పేర్కొన్నారు అలాగే మా దివ్యాంగులకు సంబంధించిన సామాజిక హక్కుల కోసం చట్టాల కోసం రాయితీ రిజర్వేషన్ల కోసం ఎప్పుడు పోరాడుతూనే ఉంటుందని ఆటు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు ఇటు దివ్యాంగులకు ఓ వారధిలా నిలుస్తుందని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామస్థాయి దగ్గర నుంచి మండల స్థాయి వరకు డిఈఎఫ్‌ను బలపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల డిఈఎఫ్ కార్యవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళలు, ఆడపిల్లల భద్రత కొరకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది

**రాష్ట్ర ప్రభుత్వం మహిళా భద్రతకు అనేక చట్టాలు రూపొందించడం జరిగింది**
**ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ**





కర్నూలు, జూలై 22 (శ్రీచక్ర): మహిళల భద్రత కొరకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ తెలిపారు. మంగళవారం దూపాడు లో ఉన్న అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళల సంక్షేమం, భద్రత ఓ హక్కులపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ మహిళల హక్కులు కాపాడటానికి, మహిళల రక్షణ, సంక్షేమానికి, మహిళలపై వివిధ రకాల హింస మరియు దారుణాలను నివారించడానికి మహిళా కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా కమిషన్ బాధ్యతలో భాగంగా మహిళా భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కొరకే ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.. మహిళా భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలు రూపొందించడం జరిగిందని, వాటి పట్ల మహిళలకు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ తెలిపారు. యువతులు ఎక్కువగా మోసపూరిత మాటలు, సోషల్ మీడియాకు ప్రభావితులై సమస్యలు ఎదుర్కొంటున్నారని అటువంటి వాటిలో కొన్ని నిజ జీవితంలో కొందరికి జరిగిన సంఘటనలు ఇక్కడ ఎందుకు చెప్పడం జరిగిందంటే అటువంటి బారిన మీరు ఎవ్వరు పడకూడదనే ఉద్దేశ్యంతో అవగాహన కల్పించడం కోసం అన్నారు. యువతులు మోసపూరిత మాటలకి, సోషల్ మీడియాకు ప్రభావితులు కాకుండా బాగా చదువుకొని జీవితంలో స్థిర పడాలన్నారు. ఎవరైనా వెంటబడి సతాయిస్తున్నట్లయితే భయపడకుండా హెల్ప్ లైన్ నంబర్ లకు ధైర్యంగా ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మీకు ఏమైనా సమస్య వస్తే ఏ హెల్ప్ లైన్ నంబర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి, వన్ స్టాప్ సెంటర్ ఏ విధంగా ఉపయోగపడుతుంది, సైబర్ క్రైమ్, పోష్ యాక్ట్, అనే అంశాల పై మీకు అవగాహన కల్పించేందుకు ఈరోజు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.. ఈ హెల్ప్ లైన్ నంబర్ ల గురించి ఇక్కడ అవగాహన సదస్సు కి హాజరు కాని విద్యార్థులకు కూడా తెలియచేయాలని విద్యార్థులకు సూచించారు. కంప్యూటర్ యుగంలో ఏదైనా సమాచారం ఎంత సులువుగా వస్తుందో అదే విధంగా క్రైమ్ కూడా అంతే త్వరగా జరుగుతుందన్నారు.. సైబర్ క్రైమ్ సమస్యలు ఈ మధ్య కాలంలో ఎక్కువగా అవుతున్నాయని, అటువంటి సైబర్ క్రైమ్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సాంకేతిక పరిజ్ఞానంను ఏ విధంగా వినియోగించుకోవాలనేది మన చేతులలో ఉంటుందన్నారు. ఎవరికి కూడా ఆన్లైన్ యాప్ లలో ఫోటో లను, వీడియో లను షేర్ చేయడం లాంటివి చేయకుండా ఉండాలన్నారు. వుమెన్ గ్రీవెన్స్ సెల్ తో పాటు ప్రతి ఉన్నత విద్యా సంస్థ లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఉండాలన్నారు. ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఎందుకు ఏర్పాటు చేస్తారు వాటి ఉపయోగాలు ఏంటిది అనే విషయాన్ని విద్యార్థులలో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి అకాడమిక్ సంవత్సరంలో ఇంట్రడక్షన్ కార్యక్రమంలో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ , ఐసిడిఎస్ పిడి నిర్మల, లోకల్ కంప్లైంట్ కమిటీ ఛైర్పర్సన్ మాధవి శ్యామల, కార్పొరేటర్ పద్మలత, ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్ మాలతి, మహిళ పోలీస్ స్టేషన్ సీఐ విజయ లక్ష్మి, రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.సునీత, శాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ నాగరాజు లు మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిసిపిఓ శారద, ఐసిడిఎస్ సిబ్బంది, అశోక ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు..

# తాగునీటి సమస్య పరిష్కారం..





వెల్దుర్తి జులై 22 (శ్రీ చక్ర) : పట్టణంలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే కే ఈ శ్యాం బాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎల్. ఈ .జ్ఞానేశ్వర్ గౌడ్ బ్రహ్మేశ్వర మైన్స్ నుంచి ప్రత్యేకంగా తాగునీటి పైప్ లైన్ కు భూమి పూజ చేశారు. దాదాపు 8 ఇంచుల వాటర్ సప్లై పట్టణంలోకి సరఫరా అవుతుందని, ప్రజలకు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఐజయ్య వీరభద్రుడు శ్రీనివాసులు వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు వడ్డే మహేష్ బాబు వడ్డే మల్లికార్జున విద్య కమిటీ చైర్మన్ రాజేష్ హరి రంగస్వామి రఘు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మునెప్ప పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ కాంట్రాక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మిగనూరు పట్టణంలో ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రిని కలిసిన విద్యార్థి సంఘాల నాయకులు,



ఎమ్మిగనూరు,జూలై, 22 (శ్రీ చక్ర ) :- ఎమ్మినూరు పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎస్సీ హాస్టల్ కోసం నిధులు విడుదల చేసిన కూడా ఇంత వరకు హాస్టల్ నిర్మాణాన్ని పున ప్రారంభించలేదని తెలిపారు. ఎస్సీ హాస్టల్ నిర్మాణం కోసం తక్షణమే ఈ విద్యా సంవత్సరంలోనే పున ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులుకి పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్, డీ ఎస్ యు రాష్ట్ర కన్వీనర్ శరత్ కుమార్ మంత్రి కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి నంద్యాల జిల్లాలో సాంఘిక సంక్షేమ రివ్యూ మీటింగుకు వచ్చిన సందర్భంగా ఆయనకు ఎమ్మిగనూరుకు ఎస్సి హాస్టల్ ను పున ప్రారంభించే విధంగా తొందరగా చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు మంత్రి కి విన్నవించారు. ఈ ప్రాంత విద్యార్థులు హాస్టల్ లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని ఎమ్మెల్యే జై నాగేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళగా దానికి ఆయన స్పందించి నిధులను మంజూరు చేయించానని చెప్పారని చెప్పడం జరిగిందని తెలిపారు. నిధులను మంజూరు చేసిన కూడా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఎస్సి హాస్టల్ నిర్మాణాన్ని పున ప్రారంభించకుండా చాలా మొండి వైఖరిని అవలంబిస్తున్నారని మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు మాత్రం హాస్టల్ నిర్మాణాన్ని పున ప్రారంభించడంలో చాలా మొండి వైఖరిని అవలంబిస్తున్నారని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

# సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటాం

**రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సూరి మన్సూర్ అలీ ఖాన్**




కర్నూలు, జూలై 22 (శ్రీచక్ర): షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటామని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సూరి మన్సూర్ అలీ ఖాన్ తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని ప్రభుత్వ బాలికల ఉర్దూ పాఠశాలలో ట్రస్ట్ తరపున ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ ను ఆయన నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా వెయ్యి రూపాయలు, రెండవ బహుమతిగా ఐదు వందల రూపాయలు, మూడో బహుమతిగా మూడు వందల రూపాయలు అందించారు. నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లను కూడా ప్రధానం చేశారు. అనంతరం సూరి మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున వివిధ రకాల సేవా కార్యక్రమాలు కొన్నేళ్లుగా చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఉర్దూ పాఠశాలలో ఈ ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ను నిర్వహించడం జరిగిందన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పార్టిసిపేట్ చేయాలని ఆయన కోరారు.

# ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరణ...



వెల్దుర్తిజులై 22 (శ్రీ చక్ర) : వెల్దుర్తి బిసి జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా పి. నరసమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగాప్రిన్సిపాల్‌మాట్లాడు తూ.. సత్యసాయి జిల్లా టేక్ లోడ్ నుండి కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలానికి డిప్టేషన్ మీద వచ్చినట్లు తెలిపారు. సొంత జిల్లా కర్నూలు అయినందు వలన ఇక్కడ విద్యార్థులకు సేవలు చేయాలని ముఖ్య ఉద్దేశంతో వచ్చినట్లు తెలిపారు. ఇందుకు మీ అందరి సహకారం ఉండాలని ప్రిన్సిపల్ సిబ్బందిని ప్రజలను పేరెంట్స్ ను కోరారు.



# ఇకనైనా కక్ష సాధింపు చర్యలు మానుకోండి..!?

తుగ్గలి, జూలై 22 : ఇకనైనా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం వైయస్సార్సీపి నేతలపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం మండల పరిధిలోని జి.ఎర్రగుడి గ్రామంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ లిక్కర్ స్కాం కేసులో వైయస్సార్సీపి ఎంపీ మిథున్ రెడ్డిని సిట్ అధికారులు సరైన ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అలాగే వైయస్సార్సీపీ శ్రేణులను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టేందుకు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రాజకీయ దురుద్దేశంతో శతవిధాల ప్రయత్నం చేస్తుందని ఇందుకోసం పడరాని పాట్లను పడుతుందని ఎద్దేవా చేశారు. వైయస్సార్సీపి హయాంలో పారదర్శకంగా ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలను నిర్వహిస్తే ఇక అవినీతికి తావు ఎక్కడుందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సృష్టిస్తూ వైఎస్సార్సీపీ శ్రేణులను టార్గెట్ చేసివారిని ఇబ్బందులకుగురిచేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని అధికారం ఎవరికి శాశ్వతం కాదని రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజల దృష్టిని వాటి నుంచి ప్రతి నెల ఏదో ఒక వివాదాన్ని తెరపైకి తీసుకురావడం టిడిపికి ఆనవాయితీగా మారింది విమర్శించారు.

# బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యవేడు మునికృష్ణయ్య



సత్యవేడు,జూలై 22(శ్రీచక్ర) :తిరుపతి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా సత్యవేడు మునికృష్ణ య్యను నియమించారు.ఈ మేరకు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు.బిజెపి జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకోగా అందులో ప్రధాన కార్యదర్శులుగా మునికిష్టయ్య,బీడీ బాలాజీ, డాక్టర్ కదిరి నరేష్ తదితరులను ఎన్నుకోవడంజరిగింది.ఈ నేపథ్యంలో సత్యవేడు మండలం పాలగుంట గ్రామానికి చెందిన సత్యవేడు మునికృష్ణయ్యను బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.గతంలో ముని కిష్టయ్య సత్యవేడు మండల బిజెపి అధ్యక్షులుగా, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా సేవలందించారు.బిజెపి పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేస్తూ సేవలు అందించిన నేపథ్యంలో ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి వివరించింది.బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్,రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్,రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి,తదితరులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి రైల్వే కోడూరు వైస్ చైర్మన్ గా డి. సతీష్ కుమార్ నియామకం



కోడూరు, జూలై 22 (శ్రీచక్ర): సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రైల్వే కోడూరు నియోజకవర్గం వైస్ చైర్మన్ గా డి. సతీష్ కుమార్ ను మంగళవారం కడప జిల్లా కార్యాలయంలో జాతీయ చైర్మన్, ప్రముఖ న్యాయవాది డా. కొప్పుల విజయ్ కుమార్ నియమించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మనకు అందించిన హక్కులను కాపాడుకోవడం మన అందరి భాధ్యత అన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం ఎవరూ కూడా కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయ, లింగ వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూడాలన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో భాగంగా ప్రతి ఒక్కరి జీవన విధానానికి ఆటంకం కలిగించే విధంగా చేయకూడదు అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టానికి రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకోవాలని సూచించారు. రైల్వే కోడూరు నియోజకవర్గం ప్రజలకు సతీష్ కుమార్ నిత్యం అందుబాటులో ఉండి సహకారం అందించాలని సూచించారు. అనంతరం సతీష్ కుమార్ మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి నియోజకవర్గం బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ గారికి తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను నిరంతరం ప్రజా సేవలో ఉంటానని, నిజమైన భాదితులకు తన వంతు సహకారం అందిస్తానని, భారత రాజ్యాంగానికి, చట్టానికి, సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సిద్ధాంతాలకు కట్టుబడి విధులు నిర్వహిస్తానని ప్రమాణం చేశారు.

## ముఖ్యమంత్రి ఆశయ సాధనకై సమన్వయంతో అభివృద్ధి పనులు కొనసాగించాలి

**అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి**
**మండల అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి అదిమూలం**






వరదయ్యపాలెం,జూలై 22:ముఖ్యమంత్రి ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావడమే మన లక్ష్యమని,మండల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి దిశగా గట్టి చర్యలు చేపట్టాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం అన్నారు.వరదయ్యపాలెం మండలంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ? "ప్రతి ఒక్క అధికారి, ఉద్యోగి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించేందుకు నిరంతరం పనిచేస్తోంది. మనం కూడా అదే దిశగా అడుగులు వేయాలి" అని అన్నారు.ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు మేలు ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్న ఆయన, వాటిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.పథకాల అమలులో పారదర్శకత,వేగం, సామూహిక బాధ్యత తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్,తహసీల్దార్ సుధీర్ రెడ్డి,ఏపీఎం సీతారామయ్య,స్త్రీనిధి మేనేజర్,ఏపీఓ,ఎం ఈ ఓ-2, ఏపీ ఎస్పిడిసిఎల్ ఏఈ,వ్యవసాయ విస్తరణ అధికారి,పంచాయతీ రాజ్ ఏ ఈ,ప్రాధమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు,ఐసిడిఎస్ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేసుకుంటూ వైఎస్ఆర్‌సిపి ప్రచారం...,

**వైసిపి కార్యకర్తల బాటే వైయస్ జగన్మోహన్ రెడ్డి బాట అని పిలుపునిచ్చిన...ఎమ్మెల్సీ మెరిగ**
**మురళి..,నూతనంగా ఎన్నికైన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు ధనంజయ రెడ్డికి పూలమాలు,శాలువాలతో సత్కారం..,**





కోట జూలై 23 (శ్రీచక్ర ) : వైసీపీ ఎమ్మెల్సీ మేరిగా మురళి నేతృత్వంలో వైఎస్ఆర్‌సిపి, పాలక సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నెరవేరని వాగ్దానాలు,విస్తృతమైన మోసం ద్వారా ప్రజా నమ్మకాన్ని మోసం చేసింది.ఈ సందర్భంగా మంగళవారం కోట మండలంలోని విద్యానగర్ నేదురుమల్లి సుబ్బారామి రెడ్డి కళాభవన్ లో జరిగిన ఉత్సాహభరితమైన కార్యక్రమంలో "చంద్రబాబు హామీ, మోసానికి హామీ" అనే శీర్షికతో క్యూఆర్ కోడ్ ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. "చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుచేసుకోవడం" అనే ఈ ప్రచారం, వైయస్ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశించిన విధంగా, ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో సంకీర్ణం విఫలమైందని పౌరులకు గుర్తు చేయడం లక్ష్యంగా పెట్టుకుందని వైసీపీ ఎమ్మెల్సీ మేరీగ.మురళి తెలిపారు.అదేవిదంగా సంకీర్ణ ప్రభుత్వం "ఏడాది కాలంగా మోసం, హింస, అవినీతి,దౌర్జన్యాల రికార్డును, ముఖ్యంగా మహిళలపై" ప్రదర్శిస్తున్నదని విమర్శించారు.దీనిని ఆయన వైఎస్ జగన్ 2019-24 పాలనతో పోల్చారు,ఈ కాలంలో "ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారు, పాలనకు ఒక ప్రమాణాన్ని ఏర్పాటు చేశారు". ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక సంవత్సరంలోనే "15 సంవత్సరాలు వెనక్కి" నెట్టారని, ఒక్క మ్యానిఫెస్టో వాగ్దానాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేకపోయారని మేరీగ మురళి ఆరోపించారు. అసమ్మతిని అణచివేయడానికి తప్పుడు కేసులతో వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు,నాయకులను లక్ష్యంగా చేసుకున్న ప్రభుత్వాన్ని ఆయన ఖండించారు. "వైఎస్ జగన్ ప్రతిష్టను దెబ్బతీయాలనే సంకీర్ణ వ్యామోహం వారి సమర్థవంతంగా పరిపాలించలేని అసమర్థతను వెల్లడిస్తుంది" అని మేరిగ నొక్కిచెప్పారు,సంకీర్ణ పార్టీ "హామీ బాండ్లు" అనేవి ఖాళీ వాగ్దానాలు అని బయటపెట్టి, ప్రతి ఇంటికి ప్రచారాన్ని తీసుకెళ్లాలని సజ్జల వైస్సార్సీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసీపీ కార్యకర్తల బాటే వైయస్ జగన్మోహన్ రెడ్డి బాట అని పిలుపునిస్తూ వైసీపీ నాయకులకు,కార్యకర్తలకు భరోసా ఇవ్వడం జరిగింది.నూతనంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైన కొడవలూరు ధనంజయ రెడ్డి ని కోట మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు,డీ ఆర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని పూలమాలలు, శాలువాలు తో సత్కరించి అభినందనలు తెలియజేశారు.అనంతరం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరలా రాష్ట్ర ముఖ్యమంత్రి గా వైయస్ జగన్మోహన్ రెడ్డిని చేయడానికి మనమంతా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కోటమే ప్రభుత్వం చేస్తున్న మోసాలను అందరికీ తెలిసేలా ప్రచారం కొనసాగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ.మురళీధర్,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు.ధనంజయ రెడ్డి,కోట మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి,రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి,మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్,జడ్పిటిసి దాసరి. కోటయ్య,వైసీపీ యువ నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి,యర్రటపల్లి మధుసూదన్ రెడ్డి,దువ్వూరు రమణారెడ్డి,చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, దేవా రెడ్డి నాగూర్ రెడ్డి పాపా రెడ్డి శశిధర్ రెడ్డి,కేతంరెడ్డి.శేషు రెడ్డి,సన్నారెడ్డి చెంచు రాఘవరెడ్డి,వైసీపీ మండల జాయింట్ సెక్రెటరీ పామల. సురేంద్ర,ఉలసా.కస్తూరయ్య యాదవ్,సుధారెడ్డి,వలిపి శ్రీనివాసులు,తదితర కోట మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు,వైసీపీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వంలో కష్టపడే వారికి తగిన గుర్తింపు

**పదవులు అలంకారం కాదు... అది ఒక బాధ్యత**
**పెనుమళ్ళ సొసైటి ప్రమాణ స్వీకార సభలో మాజి మంత్రి చిక్కాల, మంత్రి తండ్రి సత్యం**









కాజులూరు, జూలై 22( శ్రీచక్ర)కూటమి పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని, పదవి అలంకారం మాత్రమే కాదని అదొక పెద్ద బాధ్యత అని మాజి మంత్రి చిక్కాల రామచంద్రరావు,మంత్రి సుభాష్ తండ్రి సత్యం లు పేర్కొన్నారు. ఈమేరకు కాజులూరు మండలం పెనుమళ్ళ సొసైటి త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా విచ్చేసారు. చైర్ పర్సన్ గా టిడిపి సీనియర్ నేత కొల్లు వెంకటేశ్వరరావు, సభ్యులుగా బొక్కా అప్పన్న, కోన సుబ్రహ్మణ్యంలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తండ్రి సత్యం మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడి తప్పిందని, కనీసం అన్నదాతలను పలకరించే పరిస్థితి కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి పాలన సాగిస్తున్నామన్నారు. రైతాంగానికి ప్రధానమైన సొసైటీలకు పునర్జీవం తీసుకొచ్చి రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు .నియోజకవర్గంలో 31 సొసైటీల్లో పదవులు ఆశించే వారి సంఖ్య పెరగడంతో స్థానిక ప్రజలు అభిప్రాయం మేరకు పార్టీ కోసం కష్టించి పని చేసిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తూ పదవులు ఇవ్వడం జరిగిందని ,ఇందులో ఇక్కడ నూతనంగా చైర్ పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేసిన కొల్లు వెంకటేశ్వరరావు వంటి సమర్ధులకు ఇవ్వడం జరిగిందన్నారు . కూటమి ధర్మాన్ని పాటిస్తూ మంత్రి సుభాష్ సొంత నిర్ణయం తీసుకోకుండా సొసైటీలు ఉన్న చోటల్లా ప్రజాభిప్రాయం మేరకే త్రిమెన్ కమిటీ సభ్యులను ఎంపిక చేయటం జరిగిందని సత్యం ఈసందర్భంగా పేర్కొన్నారు.కూటమి అభివృద్ధిని చూసి తట్టుకోలేని వైసిపి నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలకు పునర్జీవం తీసుకొచ్చి పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తగిన నిధులు కేటాయించి రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమం, వారి ఆర్థిక పరిపుష్టికి సహకార సంఘాలు దోహదపడతాయన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నూతనంగా చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన కొల్లు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి సుభాష్ ఆయన తండ్రి సత్యం, అనుభవజ్ఞులైన సీనియర్ నేతలసూచనలతో తాను సొసైటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే 15లక్షల తో ప్రారంభమైన ఇక్కడ సొసైటీ నేడు ఏడు కోట్ల టర్న్ అవర్ తో పనిచేస్తుందని దీంతో తాను మరింత అభివృద్ధి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని తిప్పరాజుపాలెం -ఐతపూడి రహదారికి మంత్రి సుభాష్ చొరవతో కోటో30 లక్షల నిధులతో రహదారికి మోక్షం కలిగించారని వెంకటేశ్వరరావు అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పెనుమళ్ళ సొసైటీ త్రీ మెన్ కమిటీ కార్యవర్గాన్ని వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యువకు పరిశీలకులు కాకినాడ రామారావు,కూటమి పార్టీ నాయకులు చింతపల్లి వీరభద్రరావు, పెంకే సాంబశివరావు, చవ్వాకుల నారాయణమూర్తి, డిసి అధ్యక్షులు పేపకాయల బాబ్జి, వనుం వీరబ్రహ్మం, జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, మాజీ సొసైటి అధ్యక్షులు కొండమంచుల బాబు,సలాది సత్యన్నారాయణ,దేగల సతీష్,పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు. బహిరంగ వేదికపై కృష్ణారావుది పొగడ్తా విమర్శా ?ఇక్కడ ప్రమాణ స్వీకారం జరిగిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తొలిత మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన కూటమి నాయకులు ,కాజులూరు మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు మాట్లాడుతూ ఇటీవల నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో కొన్నిచోట్ల అనర్హులకు ఇచ్చారంటూ పేర్లు ఇక్కడ చెప్పడం బాగుండదు అనడంపై చేసిన వ్యాఖ్యలు ఇక్కడక వేదికపై హాజరైన మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు పలువురు రాజకీయ ప్రముఖులకు వేదికైన సభలో బహిరంగంగా మాట్లాడటం చర్చనీయాంశమై గుసగుసలు వినిపించాయి. అందుకు తగ్గట్టుగానే మంత్రి సుభాష్ తండ్రి సత్యం కూడా ఇక్కడ వేదికపై మంత్రి సొంత నిర్ణయం కాకుండా కూటమి ధర్మాన్ని పాటిస్తూ సొసైటీలు ఉన్నచోట ప్రజాభిప్రాయం మేరకు పార్టీకి సేవలు చేసిన వారినే త్రిమెన్ కమిటీ సభ్యులను ఎంపిక చేయడం జరిగిందని చెప్పడం విశేషం.


## అంతర్జాతీయ పరుగు పోటీల్లో గోల్డ్ మెడల్ సాదించిన జస్వంత్

**మంత్రి సుభాష్,ఆయన తండ్రి సత్యం అభినందనలు**



రామచంద్రపురం, జూలై 22( శ్రీచక్ర) నేపాల్ లోని రంగశాల స్టేడియంలో ఈనెల 11 నుంచి 15 వరకు జరిగిన ఇండో- నేపాల్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్- 2025 3 కేఎం విభాగం పరుగు పోటీల్లో రామచంద్రపురం విద్యార్థి మేడిశెట్టి జస్వంత్ తన ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాదించారు . ఈసందర్భంగా జస్వంత్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు. తను సాధించిన గోల్డ్ మెడల్ తో జస్వంత్ ఆయన కోచ్ నాగార్జునతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి తండ్రి సత్యంను గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ జస్వంత్ ను, కోచ్ నాగార్జునను దుస్సాలువతో సత్కరించి ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి రామచంద్రపురం కీర్తిని ప్రపంచవ్యాప్తంగా వెలుగెత్తాడంటూ అభినందించారు. ఈ సందర్భంగా జస్వంత్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తనకు మంత్రి సుభాష్ గారు రూ.20 వేలు ఆర్థిక సహాయం, ఇతర పోషకాహార వస్తువులు అందించారని గుర్తు చేశాడు. ఇటీవల జరిగిన12 వ ఓపెన్ నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పరుగు పోటీల్లో 3000 మీటర్ల విభాగంలో కూడా గోల్డ్ మెడల్ సాధించానని మంత్రికి వివరించాడు. ఈ సందర్భంగా జస్వంత్ ను ప్రోత్సహిస్తూ మంత్రి సుభాష్,సత్యంలు జస్వంత్ కు అభినందనలు తెలియజేసి, ప్రశంసలు కురిపించారు. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి రామచంద్రపురంకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం పట్ల పలువురు క్రీడాకారుడు జస్వంత్ ను, కోచ్ కె.నాగార్జున ను, జస్వంత్ కుటుంబ సభ్యులను మంత్రి సుభాష్ తో పాటు, మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎంపికైన అక్కల రిశ్వంత్ రాయ్, కంచుమర్తి బాబురావు తదితరులు ఈసందర్భంగా అభినందించారు.

## గోవర్ధనపురం జడ్పీ హైస్కూల్ లో త్రాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు బోరు బావి ఏర్పాటు







వరదయ్యపాలెం,జూలై 22(శ్రీచక్ర):గోవర్ధనపురం జడ్పీ హైస్కూల్ లో విద్యార్థులు ఎదుర్కొంటున్న త్రాగునీటి కొరత సమస్యను పరిష్కరించేందుకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం కీలక చర్యలు చేపట్టారు.పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు భోజనం ఏర్పాటుకు ఆధారపడే త్రాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర అసౌకర్యం ఏర్పడింది.దీనిని డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు,ప్రధాన ఉపాధ్యాయులు మొహిద్దీన్, పీడీ ముద్దుకృష్ణలు,స్థానిక ఎమ్మెల్యే కోనేటి అదిమూలం దృష్టికి తీసుకెళ్లి, ఎంపీడీఓ ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే తన చొరవతో,ఎంపీడీఓ ద్వారా నూతన బోరు బావిని ఏర్పాటుచేయించారు.ఈ చర్య వల్ల విద్యార్థులకు భోజన ఏర్పాటుకు అవసరమైన నీటి సమస్యకు పరిష్కారం లభించిందని,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు."ఇది కేవలం నీటి సమస్య పరిష్కారం మాత్రమే కాదు, విద్యార్థుల ఆరోగ్య రక్షణకు తీసుకున్న సానుకూల నిర్ణయం," అని ఎస్ ఎం సి చైర్మన్ బొప్పన కుమార్ పేర్కొన్నారు.పైప్ లైన్ ఏర్పాటు,మోటార్ బిగింపు చేసి యుద్ధప్రాతిపదికన నీరు అందించేందుకు తగిన ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాన ఉపాధ్యాయులు మొహిద్దీన్ తెలిపారు

## అన్యమతస్తుల గుర్తించేందుకుఇంటింటి సర్వే

తిరుమల, జూలై 22, తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను గుర్తించడానికి ఇంటింటి తనిఖీలు నిర్వహించాలని టీటీడీ భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ , హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం , టీటీడీ చట్టం ప్రకారం, టీటీడీలో హిందువులు మాత్రమే పనిచేయాలి. ఈ చట్టం దశాబ్దాలుగా ఉన్నప్పటికీ, కొంతమంది అన్య మతస్తులు టీటీడీలో ఉద్యోగాల్లో చేరారు. ఈ నేపథ్యంలో 2018లో టీటీడీ నిర్వహించిన విజిలెన్స్ విచారణలో దాదాపు 44 మంది అన్య మతస్తులు టీటీడీలో పనిచేస్తున్నారని తేలింది. టీటీడీ యాజమాన్యం 44 మంది హిందూయేతరులకు నోటీసులు జారీ చేయడంతో, వారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయం ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉంది.అయితే టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీ నూతన పాలకమండలి ఏర్పాటైంది. టీటీడీ కొత్త బోర్డు.. టీటీడీలోని హిందూయేతర ఉద్యోగులను గుర్తించి తొలగించాలని గత సంవత్సరం ఒక తీర్మానం చేసింది. అనంతరం విజిలెన్స్ విచారణ నిర్వహించంగా, 29 మంది హిందూయేతరులు ఇంకా టీటీడీ పేరోల్స్‌లో ఉన్నారని, వారిలో 15 మంది గత ఆరు సంవత్సరాలలో పదవీ విరమణ చేశారని తేలింది. ఈ నేపథ్యంలో హిందూయేతర ఉద్యోగులకు టీటీడీ స్వచ్ఛంద పదవీ విరమణ ప్యాకేజీని అందించింది, అయితే వారు ఆ ఆఫర్‌ను అంగీకరించలేదు. తాము చట్టపరంగా కేసును కొనసాగిస్తామని యాజమాన్యానికి తెలియజేశారు.ఇటీవల, ఒక సహాయ కార్యనిర్వాహక అధికారి స్థాయి ఆఫీసర్ వేరే మత విశ్వాసాన్ని అనుసరిస్తున్నట్లు తేలడంతో టీటీడీ అతన్ని సస్పెండ్ చేసింది. ఆ తర్వాత మరొక కార్యనిర్వాహక ఇంజనీర్ స్థాయి అధికారి కూడా వేరే మతాన్ని అనుసరిస్తున్నట్లు గుర్తించడంతో అతన్ని కూడా సస్పెండ్ చేశారు.మరోవైపు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇటీవల తిరుమల సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీలో 1,000 మంది అన్యమతస్తులు పనిచేస్తున్నారని, వెంటనే వర్యలు తీసుకోవాలని టీటీడీ యాజమాన్యాన్ని కోరారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. టీటీడీలో పనిచేస్తున్న హిందూయేతరులందరినీ గుర్తించడానికి విచారణ జరుగుతోందని చెప్పారు. మరోవైపు విజిలెన్స్ విచారణలో భాగంగా ఇంటింటి తనిఖీలు నిర్వహించే ఆలోచనను టీటీడీ చేస్తోందని.. టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు జి భాను ప్రకాష్ రెడ్డి వెల్లడించారు."హిందూ పేర్లు కలిగిన చాలా మంది ఉద్యోగులు ఇతర మతాలలోకి మారారని మా దృష్టికి వచ్చింది, ఇది టీటీడీ చట్టానికి , ఎండోమెంట్స్ చట్టానికి కూడా విరుద్ధం. వారి ఇళ్లను సందర్శించకుండా చేసే విజిలెన్స్ విచారణ అసంపూర్తిగా ఉంటుంది. అలాంటి వ్యక్తులు ఇతర విశ్వాసాలను ఆచరిస్తూ టీటీడీ నుంచి జీతాలు ఇతర ప్రయోజనాలను పొందడం దురదృష్టకరం" అని భానుప్రకాష్ రెడ్డి చెప్పుకొచ్చారు. మరోవైపు జూలై 22న టీటీడీ పాలకమండలి సమావేశం జరగనుంది. ప్రతిపాదిత ఇంటింటి సర్వేపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ఇంటర్ సిటీకి అదనపు బోగీలు

విజయవాడ జూలై 22, రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. ప్రయాణికుల సౌకర్యం, డిమాండ్ నేపథ్యంలో విజయవాడ - లింగంపల్లి- విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు బోగీలు అమర్చనున్నట్లు విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయంలో ఓ ప్రకటనలో తెలిపింది. విజయవాడ లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక 3ఏ ఎకానమీ కోచ్.. అలాగే లింగంపల్లి విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు మరో 3ఏ ఎకానమీ కోచ్ ఏర్పాటు చేయనున్నారు. జూలై 26, 27 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది.రైలు ప్రయాణికులకు శుభవార్త. విజయవాడ - లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయనున్నారు ఈ విషయాన్ని విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికుల సౌకర్యం కోసం, అలాగే ప్రయాణికుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను అనుసరించి రైలు నంబర్ 12795/96 విజయవాడ - లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు శాశ్వతంగా అదనపు కోచ్‌లు పెంచినట్లు విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయం వెల్లడించింది. అదనపు బోగీలు ఏర్పాటు ద్వారా మరిన్ని సీట్లు, సౌకర్యవంతమైన, సుఖవంతమైన ప్రయాణానికి వీలు కలుగుతుందని తెలిపింది.12795 నంబర్ విజయవాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక 3ఏ ఎకానమి కోచ్ అమర్చనున్నారు.12796 నంబర్ లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక 3ఏసీ ఎకానమీ కోచ్ అమర్చనున్నారు. జూలై 26, జూలై 27వ తేదీల నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయం వెల్లడించింది. మరోవైపు విజయవాడ - లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ జంక్షన్ రైల్వేస్టేషన్ నుంచి తెలంగాణలోని లింగంపల్లి మధ్య ప్రతిరోజూ అందుబాటులో ఉంటాయి. 2018లో వీటిని ప్రవేశపెట్టారు. ఏపీ రాజధాని ప్రాంతం.. హైదరాబాద్ మధ్య ప్రయాణించే ప్రభుత్వ ఉద్యోగులకు ఈ రైళ్లు సౌకర్యంగా ఉంటాయి.విజయవాడ - లింగంపల్లి- విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 336 కిలోమీటర్ల దూరాన్ని సుమారు 5 గంటల 55 నిమిషాలలో చేరుకుంటాయి. లింగంపల్లి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 గంటల 40 నిమిషాలకు లింగంపల్లి -విజయవాడ ఇంటర్‌సిటీ



# రోల్ బాల్ స్కేటింగ్ లో గోల్డ్ మెడల్ సాధించిన గగన్ పలువురు ప్రశంసలు, అభినందనలు

కాజులూరు, జూలై 22 ( శ్రీచక్ర)కాజులూరు మండలం శీల గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి పట్టాభి రామయ్య కుమారుడు గగన్ రోల్ బాల్ స్కేటింగ్లో తన సత్తాచాటి గుంటూరు టీం పై గెలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు విషయాన్ని ఆయన కుమారుడు గగన్ తోపాటు తండ్రి పట్టాభి రామయ్య మంగళవారం విషయం తెలియజేశారు. అబౌట్ 17 లో రోల్ బాల్ స్కేటింగ్ కాకినాడ లో డి ఎస్ ఏ గ్రౌండ్ నందు జరిగిన రోల్ బాల్ స్కేటింగ్ నందు విశాఖపట్నం జట్టు తరఫున పాల్గొన్నారు. ఈ పోటీల్లో అనంతపురం, తిరుపతి ,పశ్చిమగోదావరి ,విశాఖ, గుంటూరు ,జట్లు పాల్గొని హోరాహోరీగా పోరాడారు. దీంతో గుంటూరు విశాఖ జట్టు ఫైనల్ చేరుకోగా నాలుగు -ఐదు గోల్స్ తేడాతో గుంటూరు జట్టుపై విశాఖ జట్టు గెలిచింది . దీంతో విశాఖ జట్టు గోల్డ్ మెడల్ తనతోపాటు ,కప్పు ని గగన్ కైవసం చేసుకున్నారు.ఇది ఇలా ఉండగా అండర్ 17లో ఇటీవల శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ రోల్ బాల్ స్కేటింగ్ నందు కూడా శీల గ్రామానికి చెందిన గగన్ అప్పట్లో తన సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. విశాఖపట్నంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎర్రంశెట్టి గగన్ విద్యతోపాటు క్రీడల పట్ల మక్కువతో ఆసక్తి పెరిగి పట్టుదలతో క్రీడల్లో మంచి ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించి హౌరా అని పెంచుకున్నాడు. ఈ సందర్భంగా





రోల్ బాల్ స్కేటింగ్ కోచ్ పి .సంతోష్ కుమార్, రోల్ బాల్ స్కేటింగ్ స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి .చంద్రమౌళి, రోల్ బాల్స్ కేటింగ్ స్టేట్ సెక్రటరీ ఏ అనిల్ కుమార్, చేతుల మీదుగా గగన్ గోల్డ్ మెడల్ తో పాటు కప్పును అందుకున్నాడు. ఈ సందర్భంగా గగన్ మాట్లాడుతూ తాను ఈరోజు ఈ విజయంలో తన ప్రతిభను కనపరచడానికి ప్రధానంగా తమ తల్లిదండ్రుల ప్రోత్సాహం తోపాటు, కోచ్ సంతోష్ కుమార్, చంద్రమౌళి, అనిల్ కుమార్ లు సలహాలు ప్రొద్బలం,సూచనలతో తాను గోల్డ్ మెడల్స్ సాధించానని నా విజయం వెనక వీరందరి కృషి ఉందని గగన్ ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించిన గగన్ ని తోటి క్రీడాకారులతో పాటు తోటి విద్యార్థులు, అభిమానులు, శీల గ్రామ ప్రజలు తదితరులు అభిమానించి శుభాకాంక్షలు తెలిపారు.

# డ్రోన్స్ వాడకాన్ని ఆచరణలో పెట్టాలి

### జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమార్.





కాజులూరు, జూలై 22( శ్రీచక్ర)ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా రైతులు డ్రోన్స్ వాడకాన్ని తెలుసుకుని ఆచరణలో పెట్టాలని కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయ్ కుమార్ రైతులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం కాజులూరు మండలం తర్లంపూడి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ అధ్యక్షతన పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయకుమార్ విచ్చేసి రైతులతో మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలో భాగంగా రైతులు అందరూ డ్రోన్స్ వాడకం గురించి తెలుసుకుని ఆచరణ లో పెట్టాలని కోరారు. డ్రోన్స్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నానో ఎరువులు తోపాటు రసాయన పురుగు, తెగులు, మందులు పిచికారి చేసుకోవచ్చుని తెలిపారు. ఈ సాంకేతికతను రైతులకు చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వము 80% సబ్సిడిపై డ్రోన్స్ ఇస్తున్నారని, వాటిని గ్రామంలో ఉన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేసారు. అనంతరం వరి పొలంలో నానో యూరియా ఎరువును డ్రోన్ ద్వారా పిచికారి చేసి రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ పద్ధతి ద్వారా సాగులో ఖర్చులు తగ్గడమే కాకుండా రసాయనాలు వాడకం కూడా 25% వరకు తగ్గుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి కరప సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాబురావు ,మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ ,వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస వర్మ , తర్లంపూడ్ సర్పంచ్ నరాల బాలరాజు , ఎంపిటిసి గొల్లపల్లి సింహాద్రి రావు, జగన్నాదగిరి సొసైటీ అద్యూ కొండమూరి సత్యనారాయణ,కొండమూరి రమేష్ కుమార్, పెంకే అప్పారావు, కొండమూరి నరేశ్ , కొండమూరి భద్రరావు,గ్రామ పెద్దలు ,అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

# రాజ్యసభపై జనసేన గురి...

గుంటూరు, జూలై 22,జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పార్టీని విస్తరించుకోవాలని చూస్తున్నారు. 21 మంది ఎమ్మెల్యేలున్నారు. ఇద్దరు ఎంపీలున్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలున్నారు. అయితే ఆయన రాజ్యసభ పదవిలో మాత్రం ఎవరూ లేరు. త్వరలో భర్తీ అయ్యే రాజ్యసభ పోస్టుల్లో జనసేనకు ఒక పోస్టును కేటాయించాలని ఇప్పటికే చంద్రబాబు నాయుడు ముందు తన ప్రతిపాదన ఉంచినట్లు తెలిసింది. తద్వారా రాష్ట్ర, కేంద్ర ఉభయ సభల్లోనూ జనసేనకు ప్రాతినిధ్యం లభిస్తుందని భావిస్తున్నారు. త్వరలో కొన్ని రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి వచ్చే ఏడాది నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. అందులో వైసీపీకి చెందిన పరిమళ నత్వాని, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, టీడీపీకి చెందిన సానా సతీష్ బాబులు 2026 జూన్ 21న పదవీ విరమణ చేయనున్నారు. అంటే మరో ఏడాదిలో నాలుగు రాజ్యసభ సభ్యుల పదవులు ఖాళీ కానున్నాయి. ఇందులో టీడీపీకి చెందిన సానా సతీష్ బాబుకు తిరిగి రాజ్యసభ పదవి దక్కే అవకాశముంది. వైసీపీకి ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి ఒక్క పోస్టు కూడా రాదు. దీంతో మిగిలిన మూడింటిలో బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నా అందులో టీడీపీది ఒకటి ఉండటంతో దానిని వదిలేయగా మిగిలిన మూడింటిలో ఒకటి తమకు ఇవ్వాలని ఇటీవల చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన సందర్భంలో అమిత్ షా చెప్పినట్లు సమాచారం. ఆ సమావేశం తర్వాతనే పవన్ కల్యాణ్ కూడా తమ పార్టీకి ఒకటి కేటాయించాలని కోరడంతో మొత్తం ఖాళీ అయ్యే నాలుగు స్థానాల్లో రెండింటిలో టీడీపీ, బీజేపీ, జనసేన చెరి ఒకటి స్థానాలను తీసుకోవాలన్న ఒప్పందం దాదాపు ఖరారయినట్లు తెలిసింది. అయితే మొన్నటి వరకూ జనసేన నుంచి లింగమనేని రమేష్ అనే ప్రచారం నడిచింది. అయితే లింగమనేని రమేష్ కు టీడీపీ నుంచి ఇవ్వాలని పవన్ కోరినట్లు తెలుస్తోంది. సుపరిపాలన కార్యక్రమంలో కొత్త అడుగులు మరొక వ్యక్తికి... తమ పార్టీ నుంచి మరొకరిని రాజ్యసభకు పంపుతామని పవన్ కల్యాణ్ చెప్పినట్లు తెలిసింది. లింగమనేని రమేష్ పేరును జనసేన నుంచి పంపినా జనాలు మాత్రం అతనిని తెలుగుదేశం అభ్యర్థిగానే భావిస్తారని, అందుకే తమ పార్టీకి చెందిన వారికే ఇవ్వాలని పవన్ కల్యాణ్ అనుకుంటున్నట్లు సమాచారం.

# వ్యవసాయానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

విజయవాడ జూలై 22, (ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం దేశంలోనే ఒక చరిత్రాత్మక అడుగు ముందుకు వేస్తోంది. విత్తనాలు, ఎరువుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలకు.. పంట అమ్ముకోవడానికి పడే తిప్పలకు స్వస్తి పలికేలా ప్రభుత్వం కొత్త విధానం తీసుకొస్తోంది. విత్తనం నాటిన దగ్గర నుంచి.. పంట అమ్మే వరకూ ప్రతి సేవ ఇకపై రైతన్న సెల్‌ఫోన్‌లోనే అందుబాటులోకి రానుంది.ఓఖంఎటూ 2.0 తో వ్యవసాయ సేవలన్నీ డిజిటలైజ్ అవ్వనున్నాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ంఎ), ఉపగ్రహ చిత్రాలు వంటి అత్యాధునిక టెక్నాలజీతో పనిచేసే ఈ వ్యవస్థ, వ్యవసాయాన్ని సులభతరం చేయడమే కాకుండా, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడనుంది.అమెరికాకు చెందిన వాసర్ ల్యాబ్ వాసార్ ల్యాబ్ ఈ సాంకేతికతను రూపొందించింది. ఓమి ఇందుకు తోడ్పాటునిస్తోంది.రాష్ట్రంలో 60,02,607 మంది రైతుల్లో 37,65,463 మంది రైతుల గుర్తింపు కార్డులు ఇప్పటికే తయారయ్యాయి. 80లక్షల హెక్టార్ల పంట సాగు దీని పరిధిలోకి రానుంది. 18వేల గ్రామాల్లో ఈసేవలు అందుబాటులోకి వస్తాయి. ఇంతకీ ఈ కొత్త విధానం వల్ల రైతుకు ఏం లాభం? వ్యవసాయ శాఖ చెబుతున్న దాని ప్రకారం ప్రయోజనాలు ఇలా ఉన్నాయి:వ్యక్తిగత సలహాలు: ఇకపై రైతు తన పొలానికి ఏ పురుగు ఆశించనుంది, ఏ ఎరువు ఎప్పుడు వేయాలి, నీరు ఎప్పుడు పెట్టాలి వంటి కీలక సమాచారాన్ని తన సెల్‌ఫోన్‌లోనే తెలుసుకోవచ్చు. ప్రతి రైతు పొలానికి ప్రత్యేకంగా సలహాలు అందుతాయి.అన్నీ ఒక్కచోటే: విత్తనాల బుకింగ్, ఎరువుల సబ్సిడీ, పంటల బీమా, ఈ-క్రాప్ బుకింగ్, మార్కెట్‌లో పంట అమ్ముకోవడం వరకు అన్ని సేవలు ఈ యాప్ ద్వారానే జరుగుతాయి. దీనివల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయి.పారదర్శకత: సేవలు పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల అవినీతికి, జాప్యానికి ఆస్కారం ఉండదు. రైతులకు అందాల్సిన ప్రయోజనాలు నేరుగా, వేగంగా అందుతాయి.నష్ట నివారణ: తుపానులు, తెగుళ్ల వంటి వాటి గురించి ముందుగానే హెచ్చరికలు అందడం వల్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చు.ఈ మార్పుపై వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లి రావు మాట్లాడుతూ, "ఖరీఫ్ 2025 నుంచి ఆఫ్‌లైన్ సేవలు అనేవే ఉండవు. ప్రతిదీ ంఖంఎటూ 2.0 వేదిక ద్వారానే జరుగుతుంది. ఇది పారదర్శకతను పెంచి, రైతులకు వేగంగా సేవలు అందిస్తుంది," అని స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా ఇప్పటికే ఫలితాలు వస్తున్నాయి. ఎజీబబజీతీ ల్యాబ్ సూచనలు పాటించడం వల్ల ఎరువుల వినియోగం 7.5శాతం తగ్గింది. అంతే కాదు..వేరు శనగ పంట కాలాన్ని జూన్ నుంచి జూలై 15కు మార్చడం వల్ల చీడపీడల సమస్య తగ్గి దిగుబడి పెరుగుతోంది. ఏపీ మోడల్‌కు అంతర్జాతీయ ప్రశంసలుఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న ఈ డిజిటల్ నమూనా కేవలం రాష్ట్రానికే పరిమితం కాలేదు. దీనిపై అధ్యయనం చేసేందుకు ఇటీవల ఇథియోపియా ప్రతినిధుల బృందం రాష్ట్రాన్ని సందర్శించింది. ఇక్కడి విధానాలను చూసి అబ్బురపడిన వారు, తమ దేశంలో కూడా ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రశంసించారు. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా సుమారు 45 దేశాలు ఏపీ మోడల్‌పై ఆసక్తి చూపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ప్రాజెక్టును ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ "ఛాంపియన్" అవార్డుకు నామినేట్ చేసింది.

## సుపరిపాలన కార్యక్రమంలో కొత్త అడుగులు

అనంతపురం జూలై 22, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. ప్రతి ఇంటికి వెళ్లాల్సిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఏం చేస్తున్నారన్న దానిపై ఆయన ఆరా తీస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటున్నట్లు గ్రహించారు. ఏదో రెండు, మూడు గడపలు తొక్కి నామ్ కే వాస్తేగా పాల్గొని, ఫొటోలు, వీడియోలను పోస్టు చేసి తిరిగి క్యాంప్ కార్యాలయానికి వెళుతున్నారని గుర్తించారని తెలిసింది. అటువంటి మంత్రులు, ఎమ్మెల్యేలకు త్వరలోనే నేరుగా వార్నింగ్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. వ్యక్తిగతంగా పనులను పక్కనపెట్టాలని చెప్పినా కొందరు వినిపించుకోవడం లేదు.. అందుకే నియోజకవర్గంలో ఎన్ని గడపలు ఎమ్మెల్యేలు టచ్ చేసింది లెక్కలు తెప్పించుకుని మరీ వారికి మెసేజ్ ల ద్వారా అలెర్ట్ చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికీ కార్యక్రమం ప్రారంభమయింది. నేటికి 20 రోజులు పూర్తయ్యాయి. ఈ ఇరవై రోజుల్లో యాభై ఐదు లక్షలకు పైగానే గడపలు దర్శించినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇందులోనూ కొన్ని తప్పులున్నాయని చంద్రబాబు భావిస్తున్నారు. సాంకేతికతతో లెక్కలు తీద్దామనుకుంటుంటే దానికి తగ్గట్లుగా ప్రజాప్రతినిధులు కూడా వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకోవడం లేదని తెలిసింది. దీంతో చంద్రబాబు నాయుడు త్వరలోనే సమావేశం పెట్టి సీరియస్ గా వార్నింగ్ ఇచ్చే అవకాశాలున్నాయని తెలిసింది... మరొకవైపు కొందరు ప్రజాప్రతినిధులకు ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్తు ఛార్జీలపైనే ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల ఎదుటే ఈ కార్యక్రమంలో ఫిర్యాదులు చేస్తున్నట్లు ఫీడ్ బ్యాక్ వచ్చింది. విద్యుత్తు బిల్లులు భారంగా మారడంతో పాటు స్మార్ట్ మీటర్లను పెడితే తాము అంగీకరించబోమని కూడా కొందరు ఎమ్మెల్యేల ముందే తెగేసి చెబుతుండటం కూడా పార్టీ నాయకత్వం దృష్టికి వచ్చింది. దీంతో పాటు సంక్షేమ పథకాలు కూడా అర్హులైన కొందరికి అందడం లేదన్న ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఆ ఫిర్యాదులను సేకరించి నిజంగా అర్హత కలిగి ఉంటే వారికి వెల్ ఫేర్ స్కీమ్ లు అందించాలని అధికారులను ఆదేశించనున్నారుముఖ్యంగా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లతో పాటు ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం పథకంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నట్లు ఈ కార్యక్రమం ద్వారా తెలిసి వస్తుంది. గత ప్రభుత్వం తమకు పథకాలను అందించిందని, అయితే ఇప్పుడు ఏవేవో కారణాలు చూపుతూ తమను అనర్హులుగా చేయడమేంటని కొందరు నేరుగా ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువగా విద్యుత్తు ఛార్జీలు, తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లపైనే ఎక్కువగా వచ్చినట్లు గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీటిపై మరొకసారి విచారించాలని అధికారులను కోరనున్నారు. అలాగే రైతులు కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు వెళ్లగక్కుతుండటంతో కేంద్రంతో పాటు తాము కూడా ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పాలని ప్రజాప్రతినిధులకు చెప్పినా వారు సరిగా ప్రజలకు చేరవేయడం లేదని భావించిన చంద్రబాబు తానే ప్రతి సమావేశంలో చెబుతున్నారట.

## నకిలీ మొక్కజొన్న విత్తనాలతో రైతు కుదేలు

తిరుపతి ,మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధం పల్లి గ్రామానికి చెందిన రైతు నాయిని వెంకన్న సంతులాల్ పోడు తండా గ్రామంలో ఏడుఏకరాలు మొక్కజొన్న వేసిన 20 రోజులు తర్వాత మొక్కజొన్న చనిపోతుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.మధిర ట్రేడర్స్ షాప్ దగ్గర 14 ప్యాకెట్లు జొన్నలు ఇచ్చారు ఏడు ప్యాకెట్లు పయనీరు ప్యాకెట్లు మిగిలిన ఏడు ప్యాకెట్లు వేరే కంపెనీ ఇచ్చి పంట దిగుబడి అధికంగా వస్తుందని ,ఎకరానికి 40 క్వింటాలు పండుతాయి అని నమ్మబలికారు. , మొక్కజొన్న మొత్తం ఎర్రబాడి చచ్చిపోతుందని షాపు ఓనర్ కి దగ్గరకి వెళ్లి ఎన్నిసార్లు చెప్పినా కంపెనీ వాళ్లని పంపిస్తానని అంటున్నాడు.

# స్పోర్ట్స్ న్యూస్

## వాషింగ్టన్ సుందర్ భవిష్యత్ అత్యుత్తమ ఆల్‌రౌండర్.. ప్రశంసలు కురిపించిన రవిశాస్త్రి..!



టీమిండియా యువ ఆల్‌రౌండర్ వాష్టింగన్ సుందర్‌ను మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి ప్రశంసించాడు. భవిష్యత్‌లో సుందర్ భారత జట్టు అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా మారుతాడని ఆశాభవం వ్యక్తం చేశారు. పరిస్థితులను బట్టి బౌలింగ్ చేయడంతో పాటు సహజంగానే బ్యాటింగ్ చేయగల ప్రతిభ ఉన్న ఆటగాడని తెలిపాడు. ఓర్పు, సాంకేతిక నైపుణ్యం అద్భుతమని.. దాంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో విజయం సాధించగలడంటూ ప్రశంసలు కురిపించారు రవిశాస్త్రి. 2021లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియతో జరిగిన టెస్టులతో అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు అప్పటి నుంచి ఈ ఫార్మాట్‌లో పెద్దగా అవకాశాలు రాలేదు. ఇప్పటి వరకు 11 టెస్టులు ఆడి 545 పరుగులు చేయడంతో పాటు 30 వికెట్లు పడగొట్టాడు. సుందర్ రెడ్‌బాల్ మ్యాచులు మరిన్ని ఆడాల్సిందని.. ముఖ్యంగా భారత్‌లోని టర్నింగ్ పిచ్‌లపై ఆడించాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐసీసీ రివ్యూలో రవిశాస్త్రి మాట్లాడుతూ తనకు సుందర్ ఆట నచ్చుతుందని.. తొలిసారి అతన్ని చూసినప్పుడు అద్భుతమైన ఆటగాడని అనిపించింది, చాలా సంవత్సరాలు అత్యుత్తమ ఆల్‌రౌండ్‌గా మారే అవకాశం ఉందని తాను చెప్పానని గుర్తు చేశారు. ప్రస్తుతం అతని వయసు 25 సంవత్సరాలేనని.. భవిష్యత్ మరింత టెస్ట్ క్రికెట్ ఆడాల్సిందని తాను అనుకుంటున్నానన్నారు. భారత్, న్యూజిలాండ్‌లాంటి టర్నింగ్ పిచ్‌లపై ప్రమాదకరంగా బౌలింగ్ చేస్తాడని.. కొందరు సీనియర్ స్పిన్నర్ల కంటే మెరుగ్గా రాణిస్తాడని.. అదే సమయంలో బ్యాటింగ్ కూడా బాగా చేస్తాడని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. న్యూజిలాండ్‌తో 2024 స్వదేశంలో నాలుగు టెస్టుల సిరీస్‌లోని నాలుగు ఇన్నింగ్స్‌లో 16 వికెట్లు తీశాడు. సుందర్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశంసించాడు. అతన్ని ముందుగానే బ్యాటింగ్‌కు పంపవచ్చని.. సహజంగానే ప్రతిభావంతుడని శాస్త్రి పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎనిమిదో నంబర్ బ్యాట్స్‌మన్ కాకుండా ఆరో నెంబర్‌లోనూ పరుగులు చేయగలడని రవిశాస్త్రి చెప్పుకొచ్చారు.

## మాంచెస్టర్ టెస్టులో ఆకాశ్ దీప్ ఆడేది డౌటే..! తుదిజట్టు స్థానం కోసం అన్షుల్-ప్రసిద్ధ్ కృష్ణ మధ్య పోటీ..!




మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్ట్‌కు టీమిండియా సన్నద్ధమవుతున్నది. ఐదుటెస్టుల సిరీస్‌లో 1-2 తేడాతో వెనుకంజలో ఉన్నది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను నెగ్గాలని ఇంగ్లిష్ జట్టు తహతహలాడుతున్నది. టీమిండియా సైతం ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌పై పట్టు నిలుపుకోవాలని భావిస్తున్నది. కనీసం మ్యాచ్‌ను డ్రాగా ముగించాలని చూస్తున్నది. అయితే, టీమిండియాకు ప్లేయర్స్ గాయాలు తలనొప్పిగా మారాయి. మాంచెస్టర్ టెస్ట్‌కు ముందే ఆల్ రౌండర్ నితీశ్ రెడ్డి, ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, ఆకాశ్ దీప్ గాయపడ్డారు. దాంతో టీమిండియా బౌలింగ్ విభాగం ఇబ్బందికరంగా మారింది. ఈ సిరీస్‌లోని రెండో మ్యాచ్‌లో బుమ్రాస్థానంలో ఆకాశ్ దీప్ తుదిజట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో మూడు టెస్టులో చోటు దక్కించుకున్నాడు. బుమ్రా అందుబాటులోకి వచ్చినా ఆకాశ్ దీప్‌కు సైతం తుది జట్టులో టీమ్ మేనేజ్‌మెంట్ చోటు కల్పించింది. లార్డ్స్ టెస్టులో ప్రసిద్ధ్ కృష్ణను తప్పించింది. బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచులు మాత్రమే ఆడుతానని స్పష్టం చేశారు. ఈ పరిస్థితిలో ఆటగాళ్ల గాయాల సమస్యలను పరిశీలిస్తే మాంచెస్టర్ టెస్టులో బుమ్రా అందుబాటులో ఉండడం ఖాయంగా కనిపిస్తున్నది. అదే సమయంలో ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ సైతం బుమ్రా నాలుగో టెస్ట్ ఆడుతాడంటూ హింట్స్ ఇచ్చాడు. నాలుగో టెస్టు సమయానికి ఆకాశ్ దీప్ ఫిట్‌గా లేకపోతే తుదిజట్టులో ఎవరికి చోటు కల్పిస్తారనే చర్చ సాగుతుంది. ప్రాక్టీస్ సెషన్‌లో ఆకాశ్ కొద్దిసేపు ప్రాక్టీస్ చేశాడు. అతని ప్లేస్‌లో తుదిజట్టులోకి వచ్చేందుకు ప్రసిద్ధ్ కృష్ణతో పాటు అన్షుల్ కాంబోజ్ పోటీపడుతున్నారు. ప్రాక్టీస్ సెషన్‌లో ప్రసిద్ధ్ కృష్ణ, కాంబోజ్ ఇద్దరూ బౌలింగ్ సాధన చేశారు. కానీ, ఫిజియో ఆకాశ్‌ను నెట్ సెషన్‌లో బౌలింగ్ చేసేందుకు అనుమతించలేదు. కోచ్ మోర్నే మోర్కెల్ పర్యవేక్షణలో ప్రధాన మైదానంలో ఫిట్‌నెస్‌ను అంచనా వేశారు. ఆ తర్వాత నెట్ సెషన్‌లో ఒంటరిగా కనిపించాడు. అర్ష్‌దీప్ సింగ్ అతనితో కలిసి ఉన్నాడు. అర్ష్‌దీప్ చేతి గాయం కారణంగా మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఆకాశ్ దీప్ ఫిట్‌గా లేకపోతే టీమ్ మేనేజ్‌మెంట్ జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లతో పాటు మూడో ఫాస్ట్ బౌలర్ కోసం ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కాంబోజ్‌లలో ఎవరో ఒకరిని తుదిజట్టులోకి తీసుకోవాల్సి ఉంటుంది. గాయపడిన అర్ష్‌దీప్ స్థానంలో కాంబోజ్ జట్టులోకి వచ్చాడు. దాంతో అతని అరంగేట్రంపై అవకాశాలు పెరిగాయి. కాంబోజ్.. శార్దూల్ ఠాకూర్‌తో కలిసి బ్యాటింగ్ కూడా ప్రాక్టీస్ చేశాడు. నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో శార్దూల్ ఠాకూర్ ఆడే ఛాన్స్ ఉంది. నెట్ సెషన్ సమయంలో శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్‌తో పాటు పలువురు బ్యాట్స్‌మెన్లకు సిరాజ్ బౌలింగ్ వేశాడు. బుమ్రా మాత్రం మైదానంలో బౌలింగ్ సాధన చేశాడు. ప్రాక్టీస్ సెషన్‌లో పంత్ బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌ను ప్రాక్టీస్ చేశాడు. యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ తర్వాత స్లిప్ క్యాచ్‌ల ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశాడు. పలు మ్యాచుల్లో క్యాచులు జారవిడిచిన నేపథ్యంలో ఫీల్డింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాడు.

## సన్‌రైజర్స్ సామ్రాజ్యం విస్తరణ.. కొత్త జట్టును కొనుగోలు చేసిన కావ్య పాప!



ఐపీఎల్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు యజమానిగా ఉన్న కావ్య మారన్.. ప్రస్తుతం తన సామ్రాజ్యాన్ని ఇంగ్లాండ్ వరకు విస్తరించారు. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నిర్వహించే "ది హండ్రెడ్" క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ జట్టును సన్ టీవీ నెట్‌వర్క్ అధికారికంగా కొనుగోలు చేసింది. ఈ మెగా ఒప్పందం విలువ సుమారు 100.5 మిలియన్ పౌండ్లు అంటే భారత విలువలో దాదాపు రూ.1.161 కోట్లు. ఈ అతిపెద్ద కొనుగోలు ద్వారా సన్‌రైజర్స్ గ్రూప్ ప్రపంచ క్రికెట్ రంగంలో తన తదుపరి అడుగు వేసింది. సన్ టీవీ గ్రూపుకు క్రికెట్ జట్లను నిర్వహించడం కొత్తేమీ కాదు. ఇప్పటికే ఐపీఎల్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును, దక్షిణాఫ్రికాలో జరిగే ఎస్ఏ20 టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును విజయవంతంగా నిర్వహిస్తోంది. సన్ గ్రూప్ వ్యవస్థాపకుడు కళానిధి మారన్ కుమార్తె కావ్య మారన్ ఈ జట్ల సీఈవోగా ఉండి చక్కగా నడిపిస్తున్నారు.

## భారత్-పాకిస్థాన్ తొలి పోరు ఎప్పుడు జరిగింది?.. విజేత ఎవరు?



భారత్ వర్సెస్ పాకిస్థాన్ ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ యుద్ధాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటే అభిమానులలో అద్భుతమైన క్రేజ్ కనిపిస్తుంది. ఇప్పుడు భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య కేవలం ఐసీసీ టోర్నమెంట్లలో లేదా ఆసియా కప్‌లో మాత్రమే మ్యాచ్‌లు జరుగుతున్నాయి. కానీ గతంలో రెండు జట్లు ఒకరి దేశాన్ని మరొకరు సందర్శించేవి. ఈ రెండు జట్ల మధ్య క్రికెట్ యుద్ధం నేటి నుంచి 73 ఏళ్ల క్రితం 1952లో మొదలైంది. ఇప్పుడే రెండు జట్ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌ను ఘోరంగా ఓడించింది. ఎఔఆ లబ ఇఔఉ: నాలుగో టెస్టులో బద్దలయ్యే 5 రికార్డులివే!.. చరిత్ర సృష్టిస్తారా? ఎఔఆ లబ ఇఔఉ: నాలుగో టెస్టులో బద్దలయ్యే 5 రికార్డులివే!.. చరిత్ర సృష్టిస్తారా? భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య మొదటి మ్యాచ్ టెస్ట్ ఫార్మాట్లో జరిగింది. రెండు జట్లు మొదటిసారి ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా మైదానంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌ను దారుణంగా ఓడించింది. భారత్ ఈ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్, 70 పరుగుల తేడాతో గెలిచింది. భారత జట్టు కెప్టెన్‌గా లాలా అమర్‌నాథ్ వ్యవహరించగా.. పాకిస్థాన్ జట్టుకు అబ్దుల్ కర్దార్ నాయకత్వం వహించారు. ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 372 పరుగులు చేసింది. భారత్ తరఫున అత్యధిక పరుగులు హేము అధికారి చేశారు. హేము నాటౌట్‌గా 81 పరుగులు చేశాడు. విజయ్ హజారే 76 పరుగులు చేసి సహకరించారు. దీనికి బదులుగా పాకిస్థాన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 150 పరుగులకే ఆలౌట్ అయింది. దీని కారణంగా పాకిస్థాన్ ఫాలో ఆన్ ఆడాల్సి వచ్చింది. భారత బౌలర్ వీన్ మన్కడ్ మొదటి ఇన్నింగ్స్ లో 8 వికెట్లు తీశాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో కూడా పాకిస్తాన్ జట్టు 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. వీనూ మన్కడ్ ఈ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీయగా, గులాం అహ్మద్ 4 వికెట్లు పడగొట్టాడు.

## నాలుగో టెస్టులో బద్దలయ్యే 5 రికార్డులివే!.. చరిత్ర సృష్టిస్తారా?

ఎఔఆ లబ ఇఔఉ: భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో నాలుగో మ్యాచ్ జులై 23న మాంచెస్టర్‌లో జరగనుంది. 3 మ్యాచ్‌ల తర్వాత సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో ఉంది. టీమిండియా కోణం నుంచి ఈ మ్యాచ్ చాలా కీలకం. ఎందుకంటే మాంచెస్టర్‌లో ఓడితే భారత్ సిరీస్‌ను కోల్పోతుంది. మరోవైపు ఇంగ్లాండ్ జట్టు మరో విజయం సాధించి సిరీస్‌లో 3-1తో అజేయ ఆధిక్యం సాధించాలని కోరుకుంటోంది. మ్యాచ్ ప్రారంభవం కావడానికి ముందు భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ నాలుగో టెస్టులో బద్దలయ్యే 5 పెద్ద రికార్డుల గురించి తెలుసుకుందాం. ఇంగ్లాండ్ కింగ్‌గా జస్‌ప్రీత్ బుమ్రా: జస్‌ప్రీత్ బుమ్రా ఇప్పటివరకు ఇంగ్లాండ్ గడ్డపై ఆడుతూ 4 సార్లు ఒకే ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల హాల్ సాధించాడు. మాంచెస్టర్‌లో ఆడుతూ ఒకే ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొడితే, ఇంగ్లాండ్‌లో అత్యధికంగా 5 వికెట్ల హాల్స్ సాధించిన వారిలో ముత్తయ్య మురళీధరన్‌తో సమం చేస్తాడు. ముత్తయ్య మురళీధరన్ ఇంగ్లాండ్‌లో 5 సార్లు 5 వికెట్ల హాల్ సాధించాడు. గొప్ప రికార్డుకు చేరువలో రిషబ్ పంత్: భారత వికెట్ కీపర్, బ్యాటర్‌గా అత్యధిక పరుగులు చేసిన 61 ఏళ్ల రికార్డ్‌ను రిషబ్ పంత్ బద్దలు కొట్టే అవకాశం ఉంది. రిషబ్ పంత్ ఒక గొప్ప రికార్డును తన ఖాతాలో వేసుకోవడానికి కేవలం 101 పరుగుల దూరంలో ఉన్నాడు. వాస్తవానికి ఒకే టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత రికార్డు ఇప్పటికీ భారత మాజీ వికెట్ కీపర్, బ్యాటర్ బుద్ధి కుందరన్ పేరిట ఉంది. ఆయన 1963-64లో ఇంగ్లాండ్ జట్టుపై టెస్ట్ సిరీస్‌లో 525 పరుగులు సాధించారు.




ఇప్పుడు ఇంగ్లాండ్‌పై ప్రస్తుత సిరీస్‌లో రిషబ్ పంత్ ఇప్పటికే 425 పరుగులు చేశాడు. పంత్ మరో 101 రన్స్ చేస్తే 61 ఏళ్ల రికార్డ్ బద్ధలవుతుంది. ఓపెనర్‌గా చరిత్ర సృష్టించనున్న కేఎల్ రాహుల్: కేఎల్ రాహుల్ ఇంగ్లాండ్‌పై 1,000 పరుగులు పూర్తి చేయడానికి కేవలం 11 పరుగుల దూరంలో ఉన్నాడు. కేఎల్ రాహుల్ 11 పరుగులు సాధిస్తే, సునీల్ గవాస్కర్ తర్వాత ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో భారత ఓపెనర్‌గా నిలుస్తాడు. జో రూట్ మహారికార్డు: ఇంగ్లాండ్ స్టార్ క్రికెటర్ జో రూట్ ఇప్పటివరకు తన టెస్ట్ కెరీర్‌లో 37 సెంచరీలు సాధించాడు. వీటిలో 11 సెంచరీలు భారత్‌పై వచ్చాయి. స్టీవ్ స్మిత్ కూడా టీమిండియాపై ఇన్ని టెస్ట్ సెంచరీలు సాధించాడు. కేవలం ఒక సెంచరీ ఇన్నింగ్స్ ఆడితే, జో రూట్ భారత్‌పై టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా నిలుస్తాడు. చరిత్ర సృష్టించే దిశగా టీమిండియా: మాంచెస్టర్ టెస్టుల్లో ఆటగాళ్లే కాకుండా టీమిండియా కూడా ఒక చారిత్రాత్మక రికార్డును తన ఖాతాలో వేసుకోవచ్చు. భారత్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ఇప్పటివరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా గెలవలేదు. ఒకవేళ నాలుగో టెస్టులో భారత్ గెలిస్తే అది మాంచెస్టర్‌లో టీమిండియాకు మొదటి టెస్ట్ విజయం అవుతుంది.

## భారత్ మమ్మల్ని చూసి భయపడుతోంది'.. ఇంత తలపొగరా?

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ బుధవారం ప్రారంభం కానుంది. ఈ టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టు 2-1 ఆధిక్యంలో ఉంది. అయితే ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఎప్పటిలాగే భారత ఆటగాళ్లను రెచ్చగొట్టే విధంగా టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభం కావడానికి ముందే మాట్లాడటం భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. ఇంగ్లాండ్ జట్టులో దూకుడుగా ఆడే ఆటగాడిగా పేరున్న హ్యారీ బ్రూక్.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఇండియా మమ్మల్ని చూసి భయపడుతుంది' అని అన్నాడు. నాలుగో టెస్ట్‌కు ముందు ఈ వ్యాఖ్యలు భారత్ అభిమానుల్లో ఆగ్రహాన్ని రేపుతున్నాయి. ఈ విషయంపై హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. "ఇకపై మేము మంచి పిల్లల్లా మైదానంలో ప్రవర్తించం. క్రికెట్ గౌరవాన్ని కాపాడాలని మేము ప్రయత్నించాం. కానీ భారత ఆటగాళ్లు మా జట్టు ఆటగాళ్లను టార్గెట్ చేసి దాడి చేశారు. దాన్ని మేము డ్రెస్సింగ్ రూమ్ నుంచి చూశాం. దీని తర్వాత మరుసటి రోజు మేము ఏమి చేయాలో నిర్ణయించుకున్నాం. చివరి ఇన్నింగ్స్‌లో భారత్ వైపు దూసుకుపోవాలని నిర్ణయించుకున్నాం. మా ప్రవర్తన కారణంగా భారత జట్టు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. అది తక్కువ స్కోరైనప్పటికీ, పిచ్ బ్యాటింగ్ చేయడానికి కష్టంగా ఉంది. దీని వల్ల భారత ఆటగాళ్లు నిలబడలేక తమ వికెట్లు కోల్పోయారు. దీని ద్వారా మేము గెలిచాం. ఈ సిరీస్‌లో మేము ఆడే అన్ని మ్యాచ్‌లు చివరి రోజు, చివరి గంట వరకు వెళ్తున్నాయి. చాలా మంది మమ్మల్ని ఈ సిరీస్ చాలా అద్భుతంగా ఉందని అభినందిస్తున్నారు." అని హ్యారీ బ్రూక్ పేర్కొన్నారు."నాతో మాట్లాడిన చాలా మంది వారు చూసిన వాటిలో లార్డ్స్ మ్యాచ్ అత్యుత్తమమైనది అని చెప్పారు. కాబట్టి మిగిలిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల కోసం మేము చాలా ఎదురుచూస్తున్నాం. క్రికెట్‌లో ఎప్పుడూ మైదానంలో 11 మంది ఆటగాళ్లకు, ఇద్దరు ఆటగాళ్లకు మధ్యే పోరాటం. ఇలాగే క్రికెట్ పెరిగింది. రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా మాకు చాలా పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి కారణం మమ్మల్ని చూసి వారు భయపడటమే. మేము చాలా పెద్ద లక్ష్యాన్ని చేరుకోగలమని వారు భావించారు.


# బరువును తగ్గించడమే కాదు మెరిసే చర్మాన్ని అందించే అద్భుత పానీయం!





వేసవి తాపం నుండి ఉపశమనం పొందడానికి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి ఇది ఒక అద్భుతమైన మార్గం బార్లీ నీళ్లు. అంతే కాదు దీనిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఒక సహజమైన, రుచికరమైన , శక్తివంతమైన పానీయం ఇది. ఇది శతాబ్దాలుగా అనేక సంస్కృతులలో ఆరోగ్యకరమైన మరియు రిఫ్రెష్ పానీయంగా ఉపయోగించబడుతోంది. దీనిని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు.శరీర డిటాక్స్‌కు సహాయపడుతుందిబార్లీ నీరులో పొటాషియం, మాంగనీస్, విటమిన్ ః కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కాలేయాన్ని శుద్ధి చేయడంతోపాటు మలినాలను బయటికి పంపించేందుకు సహాయపడతాయి. శరీరంలోని విషపదార్థాలను బయటికి పంపి, కొత్త ఒర్రని అందిస్తుంది. అంతే కాకుండా ఈ నీరు ఆమ్లత్వాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పొటాషియం , మగ్నీషియం పేగుల్లో మంచి బ్యాక్టీరియాను పెంచి, అజీర్ణం, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తాయి. ఇది అల్సర్, గ్యాస్ ట్రబుల్ ఉన్నవారికి మంచి ఔషధంగా పని చేస్తుంది.బరువు తగ్గేందుకు ఉపకరిస్తుందిబార్లీ నీరులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది పెట్టుని ఎక్కువ సేపు నిండుగా ఉంచుతుంది. ఆకలి నియంత్రణకు సహాయపడుతుంది, ఫలితంగా అధిక భోజనం చేయకుండా ఉంటుంది. కొవ్వు కరుగుదల త్వరగా జరిగేలా సహాయపడుతుంది. అంతే కాకుండా బార్లీ నీరు సహజమైన డయూరేటిక్ (మూత్ర విసర్జనను పెంచే పదార్థం) గా పనిచేస్తుంది. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు  తగ్గించడంలో సహాయపడుతుంది. కిడ్నీ స్టోన్స్ రూపాన్ని అడ్డుకోవడానికి బార్లీ నీరు మంచి సహాయకారి.గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుందిబార్లీ నీరులో బీటా–గ్లూకాన్ అనే ఫైబర్ ఉంది, ఇది కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించడంలో సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గించి, హృదయ సంబంధిత వ్యాధులను నివారించగలదు. రక్తపోటును నియంత్రించడంతోపాటు, గుండెకు కావలసిన పోషకాలను అందిస్తుంది. గర్భిణీ స్త్రీలకు హార్మోన్లను బ్యాలెన్స్ చేయడంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో ఉబ్బసం సమస్యలను తగ్గిస్తుంది.చర్మ సౌందర్యాన్ని పెంచుతుందిబార్లీ నీరులో యాంటీఆక్సిడెంట్లు, సెలెనియం ఉన్నాయి. ఇవి చర్మ కాంతిని మెరుగుపరిచి, వృద్ధాప్య లక్షణాలను తగ్గిస్తాయి. నిత్యం బార్లీ నీరు తాగడం వల్ల చర్మం మృదువుగా, తేలికగా ఉంటుంది. మొటిమలు, చర్మంలోని మృతకణాలు తొలగడానికి సహాయపడుతుంది. అటు బార్లీ నీరులో ఉన్న ఫైబర్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, కాలన్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించగలదు. ఇది పేగుల కదలికలను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది.బ్లడ్ షుగర్ నియంత్రణబార్లీ నీరు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించి, డయాబెటిస్ ఉన్నవారికి బాగా ఉపయోగపడుతుంది. గ్లూకాన్ అనే ఫైబర్ ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించగలదు. బార్లీ నీరులో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడానికి సహాయపడతాయి.

# కీళ్ల నొప్పులకు చెక్ .. ఈ సూపర్ ఫుడ్స్ ట్రై చేయండి!



కీళ్ల నొప్పులు.. ఈ పేరు వింటేనే చాలామంది వణికిపోతారు. వయసుతో సంబంధం లేకుండా ఎందరినో వేధిస్తున్న సమస్య ఇది. కీళ్ల నొప్పులు రావడానికి ఎన్నో కారణాలున్నాయి. వంశపారంపర్యంగా రావచ్చు, ఆర్థరైటిస్ వంటి సమస్యల వల్ల రావచ్చు, లేదా శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల కూడా కీళ్ల నొప్పులు వస్తాయి. కారణం ఏదైనా నొప్పి మాత్రం నరకం చూపిస్తుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఈ నొప్పుల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం.. కీళ్ల నొప్పులను తగ్గించే ఆహారాలు: చేపలు: సాల్మన్, ట్యూనా, మాకెరెల్ వంటి చేపల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించి కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వారానికి కనీసం రెండుసార్లు చేపలు తినడం మంచిది. ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర, మెంతికూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పాలకూరలో ఉండే సల్ఫోరాఫేన్ అనే సమ్మేళనం కీళ్లలో మంటను తగ్గిస్తుంది. పండ్లు: నారింజ, బత్తాయి, నిమ్మ వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కీళ్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే బెర్రీలు, చెర్రీలు వంటి పండ్లలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కీళ్లలో మంటను తగ్గిస్తాయి.  గింజలు, విత్తనాలు: బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఇ, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని రోజూ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది.  పసుపు: పసుపులో కర్కుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీగా పనిచేస్తుంది. పసుపును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. పసుపు పాలు తాగడం లేదా కూరల్లో పసుపు వేసుకోవడం మంచిది. అల్లం: అల్లంలో జింజెరాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అల్లాన్ని టీలో వేసుకుని తాగడం లేదా కూరల్లో ఉపయోగించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వెల్లుల్లి: వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ రెండు మూడు వెల్లుల్లి రెబ్బలు తినడం ఆరోగ్యానికి మంచిది. ఆలివ్ ఆయిల్: ఆలివ్ ఆయిల్‌లో ఒలియోకాంతల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్లలో మంటను తగ్గిస్తుంది. వంటల్లో ఆలివ్ ఆయిల్ ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. రెచ్చిపోతారు ఇక! తీసుకోవలసిన జాగ్రత్తలు: సరైన ఆహారంతో పాటు వ్యాయామం కూడా చాలా ముఖ్యం. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం వల్ల కీళ్లు దృఢంగా ఉంటాయి. బరువును అదుపులో ఉంచుకోవడం కూడా చాలా అవసరం. అధిక బరువు వల్ల కీళ్లపై ఒత్తిడి పెరిగి నొప్పులు వచ్చే అవకాశం ఉంది.


# వేసవిలో శక్తినిచ్చే సూపర్ ఫుడ్స్ ఇవే!


చాలామంది వేసవికాలంలో ఎండ దెబ్బకు శరీరం డిహైడ్రేట్ అయ్యి శక్తిని కోల్పోయి నీరసంగా ఫీల్ అవుతూ ఉంటారు. అటువంటివారు సమ్మర్లో రోజంతా చురుకుగా ఉండడానికి శక్తినిచ్చే ఆరు రకాల సూపర్ ఫుడ్స్ ను తింటే మంచిదని డైటీషియన్లు చెప్తున్నారు. ఇక ఆ సూపర్ ఫుడ్స్ ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. అరటి పండ్లు అరటి పండ్లు మంచి పోషకాలతో కూడుకున్న ఆహారం. అరటి పండ్లలో పొటాషియం, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శీఘ్ర శక్తిని అందిస్తాయి. వీటిని ప్రీ వర్కవుట్ ఫుడ్ గా కూడా తీసుకోవచ్చు. గ్రీన్ టీ గ్రీన్ టీ కూడా మనకు శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. గ్రీన్ టీ తాగితే ఇది మన శరీరంలో అలసటను తగ్గించి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు శక్తి స్థాయిలను కూడా ఇది పెంపొందిస్తుంది. కనుక ఈ సీజన్ లో గ్రీన్ టీ తాగడం ఎంతో మంచిది. పాలకూర పాలకూరలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఎవరైతే తక్కువ ఐరన్ స్థాయిలు కలిగి ఉంటారో వారు శక్తి హీనులుగా ఉంటారు. ఇక శక్తి వంతులుగా ఉండాలంటే కచ్చితంగా ఆహారంలో పాలకూరని భాగంగా చేసుకోవడం సూచించదగింది. చియా సీడ్స్ చియా సీడ్స్ ను కూడా మనం ఒక సూపర్ ఫుడ్ గా చెప్పుకోవాలి. చియా సీడ్స్ ను నానబెట్టి తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. ఇందులో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ మన శరీరానికి కావాల్సిన ఎనర్జీని ఇచ్చి ఎంతగానో దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ డార్క్ చాక్లెట్ చిన్న ముక్కను ప్రతిరోజు తింటే మన శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్లను శరీరానికి అందిస్తుంది. అలసటను తగ్గించి శక్తిని పెంచుతుంది. దృష్టిని కూడా మెరుగుపరుస్తుంది. ఓట్స్ ఓట్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఓట్స్ తిన్న తర్వాత మన శరీరంలో శక్తి పెరుగుతుంది. ఇక ఎండాకాలంలో అలసటతో బాధపడేవారు, శక్తి తక్కువగా ఉందని ఇబ్బంది పడేవారు, మీ ఆహారంలో ఓట్స్ తీసుకుంటే మంచిది.



# వారసత్వ బట్టతలకు చెక్.. నివారణోపాయాలు ఇవిగో!

 జుట్టు రాలడం అనేది వయసుతో పాటు వచ్చే సహజ ప్రక్రియ. కానీ, కొందరికి యుక్త వయసులోనే జుట్టు పలుచబడి బట్టతల రావడం ఆందోళన కలిగిస్తుంది. బట్టతల రావడానికి అనేక కారణాలున్నప్పటికీ, జన్యుపరమైన కారణాలు ప్రధానమైనవి. మీ తాత ముత్తాతలకు బట్టతల ఉంటే మీకు కూడా వచ్చే అవకాశం ఉందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే, బట్టతల వెనుక దాగి ఉన్న జన్యు రహస్యాలను తెలుసుకోవాలి. వారసత్వమే ప్రధాన కారణమా? బట్టతల రావడానికి వంశపారంపర్యంగా వచ్చే జన్యువులే ప్రధాన కారణమని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయి. ఆండ్రోజెనెటిక్ అలోపేసియా అని పిలువబడే సాధారణ బట్టతల, జన్యువుల ద్వారా సంక్రమిస్తుంది. ఈ పరిస్థితిలో, జుట్టు కుదుళ్లు చిన్నగా, బలహీనంగా మారుతాయి. దీని ఫలితంగా జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా పురుషుల్లో నుదుటి భాగంలో, నెత్తి మధ్యలో జుట్టు రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. బట్టతల అనేది ఒక సంక్లిష్టమైన లక్షణం. ఇది ఒకే జన్యువు ద్వారా కాకుండా అనేక జన్యువుల కలయిక ద్వారా ప్రభావితమవుతుంది. అంటే, మీ తల్లిదండ్రులిద్దరి నుండి సంక్రమించే జన్యువులు మీ జుట్టు ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి, మీ తండ్రికి బట్టతల లేకపోయినా, మీ తల్లి వైపు బంధువులకు ఉంటే మీకు బట్టతల వచ్చే అవకాశం ఉంది. బట్టతలకు కారణమయ్యే ఇతర అంశాలు: జన్యువులే కాకుండా, ఇతర అంశాలు కూడా బట్టతలకు కారణమవుతాయి. వాటిల్లో హార్మోన్ల అసమతుల్యత ఒకటి. ఆండ్రోజెన్ అనే హార్మోన్ జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్ స్థాయి పెరిగినప్పుడు జుట్టు కుదుళ్లు కుంచించుకుపోయి జుట్టు రాలడం మొదలవుతుంది. అంతే కాకుండా వయస్సు పెరిగే కొద్దీ జుట్టు కుదుళ్లు బలహీనమవుతాయి. దీనివల్ల జుట్టు రాలడం సాధారణం. మరోవైపు సరైన పోషకాహారం లేకపోవడం వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు తగినంతగా తీసుకోకపోతే జుట్టు బలహీనంగా మారుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి జుట్టు రాలడానికి దారితీస్తుంది. ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు కుదుళ్లను ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ సమస్యలు, రక్తహీనత, కొన్ని రకాల చర్మ వ్యాధులు జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని రకాల మందులు, కీమోథెరపీ జుట్టు రాలడానికి దారితీస్తాయి.  బట్టతలను నివారించడం ఎలా? వారసత్వంగా బట్టతల వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించవచ్చు. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోండి. యోగా, ధ్యానం, వ్యాయామం వంటి వాటి ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. జుట్టును శుభ్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో కూడిన ఉత్పత్తులను వాడకుండా సహజమైన ఉత్పత్తులను ఉపయోగించాలి. జుట్టు రాలడం ఎక్కువగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి. బట్టతల అనేది ఒక సాధారణ సమస్య అయినప్పటికీ, దాని గురించి దిగులు చెందాల్సిన అవసరం లేదు. సరైన జాగ్రత్తలు, చికిత్సలతో జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ఒకవేళ బట్టతల వచ్చినా, ఆత్మవిశ్వాసంతో ఉండటం ముఖ్యం. ఎందుకంటే, మీ వ్యక్తిత్వం మీ జుట్టు కన్నా ఎంతో విలువైంది.






# రామయాణలో పనిచేయడం గర్వంగా ఉంది

## హన్స్ జిమ్మర్‌తో కలసి సంగీతం అందిస్తున్న రహమాన్




నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామాయణ' భారీస్థాయిలో తెరకెక్కుతోంది. ఇక 'రామాయణ' రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగం2026 దీపావళికి, రెండవ భాగం 2027లో విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్ర ప్రధాన తారాగణం ఖరారైంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. రూ.4000 కోట్లతో ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాకు హాలీవుడ్ మ్యూజిక్ దర్శకుడు హన్స్ జిమ్మర్‌తో కలిసి ఏఆర్ రెహమాన్ స్వరాలు అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మ్యూజిక్‌పై ఏఆర్ రెహమాన్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌కు ఇలాంటి గొప్ప సంగీత దర్శకుడితో కలిసి పనిచేస్తానని నేనే కాదు.. ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. రామాయణ' మన భారతీయ సంస్కృతి. ఇలాంటి ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం నాకు గర్వంగా ఉంది. అంతా అనుకున్నట్లుగా జరిగి మీ ముందుకు దీన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను. నేను, హన్స్ జిమ్మర్ దీనికోసం ఎన్నో సెషన్‌లు వర్క్ చేశాం. మొదటిది లండన్‌లో, రెండోది లాస్ ఏంజెలెస్‌లో, మూడో సెషన్ దుబాయ్‌లో చేశాం. హన్స్ అన్ని విషయాల్లో నాలానే ఆలోచిస్తారు. మన సంస్కృతిపై ఎంతో గౌరవం ఉంది. తనకు ఏమైనా అర్థం కాకపోతే 'దీన్ని వెస్టర్న్ స్టైల్‌లో కంపోజ్ చేయచ్చా' అని అడుగుతారు. రామాయణ సినిమా అందరూ ఆశ్చర్యపోయేవిధంగా రానుంది. కచ్చితంగా చరిత్ర సృష్టిస్తుందని రహమాన్ అన్నారు.హన్స్ జిమ్మర్ ఎన్నో హాలీవుడ్ సినిమాలకు సంగీతం అందించారు. 'డ్యూన్', 'ఇంటర్ స్టెల్లార్' వంటి చిత్రాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా తన ప్రతిభతో ఆకట్టుకున్నారు. రెండుసార్లు ఆస్కార్ అవార్డులను, ఐదుసార్లు గ్రామీ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు 'రామాయణ'కు మన లెజెండరీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆయనతో పాటు వర్క్ చేస్తున్నారు.



# మెగా 157 షూట్ పార్ట్ లీక్

## ఇలాంటి వాటిపై చర్యలు తప్పవని టీమ్ హెచ్చరిక

మెగాస్టార్ చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'మెగా 157' సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. చిరంజీవి సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార కథానాయికగా నటిస్తోంది. అయితే ఇప్పటివరకు ఈ సినిమాకు సంబంధించిన అధికారిక అప్డేట్లు- ఏవీ బయటకు రాకపోయినా, అభిమానులలో మాత్రం ఉత్కంఠ ఏ మాత్రం తగ్గడం లేదు. ఇప్పటివరకు షూటింగ్ వివరాలు బయటకు రాకుండా బాగా జాగ్రత్తలు తీసుకుంటున్న బృందానికి.. ఒక చేదు అనుభవం ఎదురైంది. ప్రస్తుతం కేరళలో జరుగుతున్న షెడ్యూల్‌లో చిరంజీవి - నయనతారపై కీలక సన్నివేశాలు, ఒక పాట చిత్రీకరిస్తుండగా, అందులో భాగంగా ఓ వీడియో లీక్ అయింది. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయాన్ని గమనించిన చిత్రబృందం తాజాగా అధికారికంగా స్పందించింది.. అలాంటి లీక్‌లను పంచుకోవద్దని .. అభిమానులు మేకర్స్ నుండి వచ్చే అధికారిక అప్డేట్ కోసం ఓపికగా ఉండాలని, లీక్డ్ కంటెంట్‌ను షేర్ చేయకుండా సహకరించాలని బృందం విజ్ఞప్తి చేస్తోంది. 'ఇలా సెట్స్ లోపల తీసిన ఫోటోలు, వీడియోలు బయటకు రావడం వల్ల సినిమా మీద నెగిటివ్ ఎఫెక్ట్ పడుతుంది. పైగా ఇది కేవలం లీక్ కాదు, కాపీరైట్ హక్కుల ఉల్లంఘన కూడా. ఇలా ఎవరు చేస్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ సినిమా జాగ్రత్తగా, ప్రేమతో, ఎంతో కష్టపడి చేస్తున్నారు. అందుకే ఫ్యాన్స్‌కి, మీడియా వేదికలకి ఒకే అభ్యర్థన, మాకు తోడుగా ఉండండి. అధికారిక సమాచారం రాగానే మేమే మీతో పంచుకుంటాం. మనమంతా కలసి ఈ ప్రాజెక్ట్‌ను అందంగా, బాగుపడేలా చూసుకుందాం. ఎలాంటి లీక్‌లు లేకుండా మనం సమర్థంగా ముందుకు సాగుదాం. మీ ప్రేమ, సహకారం కోసం ధన్యవాదాలు' అంటూ నోట్ విడుదల చేశారు. ఈ వార్త వైరల్ అవుతుంది.



# ట్రైలర్ చూస్తే..ట్రోల్స్ చేసేవాళ్లు ఔట్

## విశ్వంభరపై దర్శకుడు వశిష్ట




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, త్రిష హీరోయిన్‌గా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక ఫాంటసీ ఎంటర్టైనర్ 'విశ్వంభర' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 2023 దసరా సందర్భంగా విడుదలైన గ్లింప్స్‌కు మిక్స్‌డ్ స్పందన రాగా, కొన్ని ట్రోల్స్ కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి, అదే గ్లింప్స్‌ను టార్గెట్ చేసిన ట్రోల్స్‌కి గట్టి సమాధానం ఇవ్వబోతున్నాడట దర్శకుడు వశిష్ఠ. తాజా ఇంటర్వ్యూలో వశిష్ఠ మాట్లాడుతూ.. గతంలో ట్రోల్స్ ఎలా వచ్చాయో తెలుసు. కానీ ఈసారి ట్రైలర్ చూస్తే ట్రోల్స్ చేసిన వాళ్లే మెచ్చుకుంటారు. సినిమా ఫీల్, గ్రాండియర్, కాన్సెప్ట్ అన్నీ కలిపి చూపించబోతున్నాం అని చెప్పారు. అయితే మొదటి నుంచి కూడా విశ్వంభర.. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' తరహాలో ఉంటుందని వార్తలు వచ్చాయి ఇలా వీటన్నింటికీ మెయిన్ లోకం సత్యలోకం.. అదే బ్రహ్మ లోకం. ఇప్పటివరకు చాలామంది డైరెక్టర్స్ తమకు నచ్చిన పద్ధతిలో నచ్చిన లోకాన్ని చూపించారు. కానీ నేను ఇప్పుడు సత్యలోకానికి చూపించబోతున్నాను. విశ్వం మొత్తాన్ని భరించేదే విశ్వంభర. అక్కడ ఉన్న హీరోయిన్ కోసం హీరో 14 లోకాలు దాటి వెళ్తాడు. ఆ సత్యలోకం నుంచి హీరోయిన్‌ను హీరో ఎలా కిందకు తీసుకొచ్చాడు అనేది కథ' అని చెప్పుకొచ్చాడు. ప్రజంట్ ఈ వార్త కూడా వైరల్ అవుతుంది.

# అన్నదమ్ముల అనుబంధం

## అన్నంటే మా అన్నే..ఆనంద్ దేవరకొండ


విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తోన్న సినిమా 'కింగ్డమ్' .ఇటీవల ఈ చిత్రం నుంచి 'అన్నా అంటేనే..' పాట విడుదలైన విషయం తెలిసిందే. అన్నదమ్ముల అనుబంధాన్ని చూపేలా ఉన్న ఆ పాట విని తాను భావోద్వేగానికి గురైనట్లు- విజయ్‌దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. వారిద్దరి చిన్నప్పటి ఫొటోలతో చేసిన వీడియోను పంచుకున్నారు. ఈ పాట విని ఎమోషనల్ అయ్యాను. నాకెప్పుడు కష్టం వచ్చినా విజయ్ నాకోసం ముందుంటాడు. నా కలలను తనవిగా భావిస్తాడు. మన తోబుట్టు-వులు బయటకు కనిపించకుండానే మనపై ఎంత ప్రేమ చూపిస్తారో నాకు మా అన్నను చూసే అర్థమైంది. మన నుంచి ఏమీ ఆశించకుండానే ఎంతో ప్రేమ చూపిస్తారు. బహుశా ఈ పాట మా ఇద్దరి కోసమే రాసి ఉంటారు. అన్న అంటే నీలా ఉండాలని అంటూ విజయ్ దేవరకొండను ట్యాగ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. తాజాగా 'కింగ్డమ్' నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ విజయ్ దేవరకొండపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



# ఓ పోరాట వీరుడి నేపథ్యంతో కథ అల్లాం

## హరిహర వీరమల్లుపై నిర్మత ఎఎం రత్నం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. ధర్మం కోసం పోరాడే యోధుడి పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్నారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధి అగర్వాల్, బాబీ డియోల్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జూలై 24న విడుదల కానున్న 'హరి హర వీరమల్లు' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు, పాటలకు విశేష స్పందన లభించింది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఆ ఉత్సాహంతో ప్రచార కార్యక్రమాల్లో చిత్ర బృందం జోరు పెంచింది.జూలై 21న హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించబోతున్నారు. అలాగే తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన లెజండరీ నిర్మాత ఎ.ఎం. రత్నం.. సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 17వ శతాబ్దం నేపథ్యంలో జరిగే కథ ఇది. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లుకోవడం జరిగింది. హరి హర




వీరమల్లు పేరు పెట్టడానికి కారణం ఏంటంటే.. హరి హర అంటే విష్ణువు, శివుడు కలయిక. అలాగే వీరుడిని సూచించేలా వీరమల్లు అని పెట్టాము. నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించాను. అయితే నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. అయితే ఇది పవన్ కళ్యాణ్ గారు డేట్స్ ఇచ్చినంత మాత్రాన వెంటనే పూర్తి చేయగలిగే సాధారణ చిత్రం కాదు. అత్యంత భారీ చిత్రం. సెట్స్, గ్రాఫిక్స్‌తో ముడిపడిన చారిత్రక కథ. అందుకే ఆలస్యమైంది. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెప్తున్నాను.. హరి హర వీరమల్లు ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందన్నారు. నేను రూపొందించిన ఎక్కువ శాతం సినిమాలు అలాగే ఉంటాయి. జూలై 24 తెల్లవారుజాము నుంచి షోలు వేయాలని మేము భావించాము. కానీ అభిమానులు ముందురోజు రాత్రి నుంచే షోలు వేయాలని కోరుతున్నారు. వారి కోరిక మేరకు జూలై 23 రాత్రి నుంచి షోలు వేసే ఆలోచనలో ఉన్నాము. ఖుషి, బంగారం తర్వాత పవన్ కళ్యాణ్ గారితో చేసిన మూడో చిత్రమిది. పవన్ కళ్యాణ్ గారు జాతీయ నాయకుడిగా ఎదిగారు. ఆయన సినిమా వస్తుందంటే దేశవ్యాప్తంగా దృష్టి ఉంటుంది. అందుకే మేము బాధ్యతగా భావించి, మరింత శ్రద్ధగా సినిమాని రూపొందించాము. పవన్ కళ్యాణ్ గారి గౌరవానికి తగ్గట్టుగా సినిమా ఉంటుంది.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**